ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 33.5
కనిష్ఠం 23.2

ANDHRAJYOTHY



సూర్యాపేట

5

బుధవారం 6 ఆగస్టు 2025

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	587.20 (305.6242)	44,271	44,271
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.13 (4.02)	5,215	4,000
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.981 (44.1813)	28,159	17,000

చికెన్ ధరలు | లైవ్ : రూ.122 | డ్రెస్ : రూ.182 | స్కిన్‌లెస్ : రూ.205



జూలైలో ఆపరేషన్ ముస్కాన్‌లో పెన్ పహాడ్ మండలం దూపాడు వద్ద ఇటుకబట్టీల నిర్వాహకులకు అవగాహన కల్పిస్తున్న వివిధశాఖల అధికారులు(ఫైల్)

పనిలో బాల్యం బందీ

బాలకార్మికులను వెట్టిచాకిరి నుంచి విముక్తి కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నాలు చేస్తున్నాయి. అయినప్పటికీ బాలకార్మికులకు పూర్తిగా విముక్తి కలగడంలేదు. ఇంకా బాలకార్మికులతో వెట్టిచాకిరి చేయిస్తున్నారు. పోలీస్, రెవెన్యూ, ఇతర శాఖలు సంయుక్తంగా ప్రతీ ఏడాది రెండు పర్యాయాలు చేపడుతున్న స్మైల్, ముస్కాన్ కార్యక్రమాలు కొద్దిమేర ఫలితాలను ఇస్తున్నాయి. కుటుంబ ఆర్థిక పరిస్థితులు, ఇతర కారణాలతో చాలామంది చిన్నారుల బాల్యం పనిలో బందీ అవుతోంది. జిల్లాలో ఆరేళ్లలో 1,520 మంది బాలకార్మికులకు ఈ ఏడాది విముక్తి కలిగించారు.

- (ఆంధ్రజ్యోతి-సూర్యాపేట క్రైం)

- అమలుకు నోచుకోని బాలకార్మిక చట్టాలు
- ఆపరేషన్ స్మైల్, ముస్కాన్‌లతో కొంత మేర విముక్తి
- ఎక్కువగా ఇతర రాష్ట్రాలకు చెందిన పిల్లలు

బాలకార్మిక వ్యవస్థ పూర్తిగా రూపుమాపేందుకు ప్రభుత్వాలు పకడ్బందీగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నప్పటికీ సరైన ఫలితాలు రావడం లేదు. 2017 నుంచి జిల్లాలో ఆపరేషన్ స్మైల్, ముస్కాన్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది జనవరిలో స్మైల్, జూలైలో ముస్కాన్ ముగిసింది. ఈ రెండు కార్యక్రమాల్లో జిల్లావ్యాప్తంగా 340 మంది బాలలకు విముక్తి కల్పించి వారిని బడిబాట పట్టించారు. జిల్లాలో 2019 నుంచి 1,520 మంది బాలలను స్మైల్, ముస్కాన్ కార్యక్రమాల ద్వారా వెట్టిచాకిరి నుంచి విముక్తి కల్పించి వారికి విద్యనందిస్తున్నారు.

జూలైతో ముగిసిన ముస్కాన్...

జిల్లాలో బాలలకు పని నుంచి విముక్తి కల్పించే ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమం జూలై 31తో ముగిసింది. ఈ కార్యక్రమం జిల్లాలో నెల రోజుల పాటు కొనసాగింది. ప్రధానంగా ఇటుక బట్టీలు, హోటళ్లు, మెకానిక్ షెడ్లలో అనేకమంది బాల కార్మికులు పనిచేస్తున్నారు. అలాంటి వారిని అక్కున చేర్చుకొని వారికి విద్యా బుద్ధులు నేర్పించేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇదిలా ఉండగా ఈ ఏడాది జనవరిలో ఆపరేషన్ స్మైల్ చేపట్టారు. 2017 నుంచి ఈ రెండు కార్యక్రమాలను జిల్లాలో ప్రారంభించారు.

ఆరేళ్లలో 1,520 మంది బాలలకు విముక్తి

జిల్లావ్యాప్తంగా 2019 నుంచి నిర్వహించిన ఆపరేషన్ స్మైల్, ముస్కాన్ కార్యక్రమాల ద్వారా 1,520 మంది బాలకార్మికులకు విముక్తి కల్పించారు. అందులో 1,384 మంది బాలురు, 136 మంది బాలికలు ఉన్నారు. వీరిలో రాష్ట్రానికి చెందిన వారు 674 మంది ఉండగా, ఇతర రాష్ట్రాల వారు 846మంది ఉన్నారు. వీరందరికీ వసతి కల్పించి బడిబాట పట్టించారు.

యజమానులపై 950 కేసులు నమోదు

బాల కార్మికులకు అండగా పోలీస్, చైల్డ్‌వెల్ఫేర్, కార్మిక శాఖ, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ఎక్కడికక్కడ తనిఖీలు నిర్వహిస్తూ 14ఏళ్లలోపు పని చేసే పిల్లలను గుర్తిస్తున్నారు. ప్రధానంగా మెకానిక్ షెడ్లు, ఇటుక బట్టీలు, హోటళ్లు, రోడ్లపై బిక్షాటన చేసే చిన్నారులను గుర్తించి వారి అభివృద్ధికి బాటలు వేస్తున్నారు. బాల కార్మికులను వెట్టిచాకిరి నుంచి విముక్తి కల్పించి వారిని ప్రయోజకులుగా తీర్చిదిద్దుతున్నారు. తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారిన చిన్నారులను సైతం గుర్తించి వారికి భోజనవసతి సౌకర్యంతో పాటు విద్యనందిస్తున్నారు. బాలకార్మికులను పనిలో పెట్టుకున్న యజమానులపై కేసులు నమోదు చేస్తున్నారు. అందులో భాగంగా జిల్లాలో ఇప్పటివరకు 950కి పైగా కేసులు నమోదుచేశారు. కొంతమంది యజమానులకు రూ.5వేలు, రూ.10వేల చొప్పున జరిమానాను విధించారు.

బాలకార్మికులకు అండగా పోలీస్ శాఖ



జిల్లాలో వెట్టిచాకిరికి గురవుతున్న బాలకార్మికులకు పోలీస్‌శాఖ అండగా ఉంటోంది. ఏడాదిలో ఆపరేషన్ స్మైల్, ముస్కాన్ కార్యక్రమాలను నిర్వహిస్తూ బాల కార్మికులకు విముక్తి కల్పిస్తున్నాం. జూలైలో చేపట్టిన ముస్కాన్ ద్వారా జిల్లావ్యాప్తంగా 143 మంది బాలలకు విముక్తి కల్పించి బడిబాట పట్టించాం. బాలకార్మిక వ్యవస్థను రూపుమాపేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలి. 14 ఏళ్లలోపు చిన్నారులను పనిలో పెట్టుకుంటే చట్టపరంగా కేసులు నమోదు చేస్తాం.

- కొత్తపల్లి నర్సింహ, ఎస్పీ, సూర్యాపేట



చెల్మాచెదారంతో చింతిర్యాల కాల్వ

నీరొస్తుంది.. దారేదీ?

- పూడిక, పిచ్చిమొక్కలతో కాల్వలు
- చింతలపాలెం మండలంలో కాల్వల అధ్వానస్థితి
- కిష్టాపురంలో కాల్వ తెగి పంటకునష్టం

చింతలపాలెం మండలంలో సాగు నీటి కాల్వల నిర్వహణ అధ్వానంగా తయారైంది. నీటిపారుదల శాఖ అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో ఏకాల్వ చూసినా పిచ్చిమొక్కలు, పూడిక నిండి నీరు ముందుకు సాగని పరిస్థితులు నెలకొన్నాయి. అటు ప్రధాన సాగర్ కాల్వతో పాటు ఉపకాల్వలు కూడా అస్తవ్యస్తంగా తయారయ్యాయి. ఇటీవల ప్రధాన కాల్వకు నీటిని విడుదల చేయడంతో కోతకు గురై మిర్చి పంట నీటిపాలైంది.

- (ఆంధ్రజ్యోతి-చింతలపాలెం)

చింతలపాలెం మండలంలోని సాగునీటి కాల్వల నిర్వహణ విషయంలో నీటిపారుదల శాఖ అధికారులు, కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని ఏ సాగునీటి కాల్వ చూసినా పిచ్చిమొక్కలు, మట్టి ఇసుకతో నిండిపోయి నీరు ముందుకు సాగలేని పరిస్థితులు నెలకొన్నాయి. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కాల్వల గురించి అధికారులను ఆదేశించినా, సమీక్షా సమావేశాలు నిర్వహించినా క్షేత్రస్థాయిలో పనితీరులో మార్పు రావడం లేదు. నాగార్జునసాగర్ ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన ప్రధాన కాల్వతో పాటు పంట కాల్వల్లో పూడిక పేరుకుపోయిందని అధికారులకు తెలిసినప్పటికీ పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. వానాకాలం సాగు ప్రారంభమై ఆగస్టు మాసం వచ్చినా అధికారులు ఆ వైపు చూసిన దాఖలాలు లేవంటున్నారు. పంట కాల్వలో పిచ్చి మొక్కలు తీసివేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కాల్వల్లో పూడికతీత పనులు పూర్తి కాకముందే నీటిని విడుదల చేయడం సరికాదంటున్నారు.

19 వేల ఎకరాల్లో సాగు..

చింతలపాలెం మండలంలో మొత్తం 150 కిలోమీటర్ల పొడవు కాల్వలు ఉన్నాయి. చింత్రియాల మేజర్, బుగ్గమాదారం మేజర్ కాల్వలతో పాటు సబ్‌మేజర్ కాల్వలు, బ్రాంచ్ కాల్వలో ఇందులో ఉన్నాయి. సుమారు 19 వేల ఎకరాల మెట్ట పంటల సాగుకు...

- మిగతా 8వ పేజీలో...

జాతీయ స్థాయిలో ప్రతిభ చాటాలి



పతకాలు సాధించిన పోలీసు సిబ్బందిని అభినందిస్తున్న ఎస్పీ నర్సింహ

సూర్యాపేటక్రైం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పూణెలో త్వరలో జరగనున్న జాతీయ స్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌లో ప్రతిభ చూపి పతకాలు సాధించి రాష్ట్ర, జిల్లా పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకరావాలని ఎస్పీ కొత్తపల్లి నర్సింహ అన్నారు. ఇటీవల వరంగల్ జిల్లా మామునూరు పోలీస్ శిక్షణ కేంద్రంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌లో యాదాద్రి జోన్ తరపున సూర్యాపేట హెడ్‌కానిస్టేబుల్ కళ్యాణ్‌చక్రవర్తి పాల్గొని సాంకేతికత దర్యాప్తులో తృతీయ స్థానం, నార్కోటిక్ డాగ్ రోలెక్స్ మత్తు పదార్థాల తనిఖీల పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపి ద్వితీయ స్థానం సాధించింది. దీంతో పోటీల్లో ప్రతిభ చూపిన హెడ్‌కానిస్టేబుల్ కళ్యాణ్‌చక్రవర్తి, రోలెక్స్ డాగ్ శిక్షకుడు కానిస్టేబుల్ సతీష్‌ను మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అభినందించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖ అధునాతన టెక్నాలజీని ఉపయోగిస్తూ నేరాలను ఛేదిస్తుందన్నారు. ప్రతీ పోలీస్ నూతన టెక్నాలజీపై పట్టుసాధించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవీందర్‌రెడ్డి,జనార్దన్‌రెడ్డి,డీఎస్పీలు ప్రసన్నకుమార్, నర్సింహాచారి తదితరులు ఉన్నారు.


సమరయోధుల స్ఫూర్తితో ముందుకు సాగాలి



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయవాది మల్లు నాగార్జునరెడ్డి

చివ్వెంల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తితో విద్యార్థులు ముందుకు సాగి, చిన్నతనం నుంచే దేశభక్తి భావాలు కలిగి ఉండాలని న్యాయవాది మల్లు నాగార్జునరెడ్డి అన్నారు. మండలంలోని దురాజ్‌పల్లి మైనార్టీ గురుకుల పాఠశాలలో మంగళవారం ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన ముస్లిం, మైనారిటీ యోధుల చిత్రపటాలతో రూపొందించిన ఫొటో ఎగ్జిబిషన్‌లో పాల్గొని మాట్లాడారు. దేశం కోసం జరిగిన ఉద్యమంలో మైనార్టీల పాత్ర మరువలేనిదని కొనియాడారు. ఉద్యమంలో పెద్దసంఖ్యలో ముస్లింలు ప్రాణాలు కోల్పోయారన్నారు. విద్యార్థులు చిన్నతనం నుంచే లౌకికతత్వాన్ని, సమానత్వాన్ని అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆవాజ్ జిల్లా కమిటీ సభ్యులు జహంగీర్, రంగారెడ్డి, అబ్దుల్లా, ఖాలేద్‌అహ్మద్, యాదగిరిరావు, నరసింహారావు, వెంకన్న, పాల్గొన్నారు.

పశువుల ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలి



మెగా పశువైద్య శిబిరంలో ఖనిజలవణం, కాల్షియం ప్యాకెట్‌లను అందజేస్తున్న జిల్లా పశువైద్య, పశు సంవర్థక శాఖ అధికారి శ్రీనివాసరావు

పెన్‌పహాడ్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పశువుల ఆరోగ్యంపై రైతులు జాగ్రత్తలు పాటించాలని జిల్లా పశువైద్య, పశుసంవర్థక శాఖ అధికారి డాక్టర్ శ్రీనివాసరావు అన్నారు. సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం పెన్‌పహాడ్ మండలం దూపహాడ్ గ్రామంలో ఏర్పాటుచేసిన ఉచిత మెగా పశువైద్య శిబిరం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పశుసంపద మనం ఆశించిన ప్రయోజనాలను అందజేస్తున్నందున వాటిని ఆరోగ్యంగా ఉంచడమే లక్ష్యమని అన్నారు. ఈశిబిరంలో 55గేదెలకు, 10పశువులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. 20 కిలోల ఖనిజ లవణం, 20లీటర్ల కాల్షియాన్ని పాడిరైతులకు అందించారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ అనంతుల వెంకన్న, అనంతారం పశువైద్యాధికారి డాక్టర్ ఎర్రంశెట్టి కిరణ్‌కుమార్, గడ్డిపల్లి పొనుగోడు పశువైద్యాధికారులు జయసుధ, శ్రీకాంత్, గోపాలమిత్రలు మేడం వెంకన్న, సైదులు, మహిబెల్లి, నగేష్, వైద్య సిబ్బంది రవి, జుబేర్, రైతు దొంగరి చిలకమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోతల నిర్వహణలో రైతుల భాగస్వామ్యం

మంత్రి ఉత్తమ్ సమీక్షా సమావేశం



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్, కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి

హుజూర్‌నగర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఎత్తిపోతల పథకాల నిర్వహణలో రైతులు భాగస్వామ్యం కావాలని నీటిపారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కోరారు. హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాలలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ఎత్తిపోతల పథకాలు, నీటిపారుదల, మునిసిపల్ రోడ్లు, ఆర్టీసీ తదితర శాఖలపై మంగళవారం హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయంలోని జూబ్లీ ఆడిటోరియంలో ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో నీటిపారుదల శాఖను చిన్నాభిన్నంచేసి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. ఎత్తిపోత ల పథకాలను పట్టించుకోలేదన్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నీరు ఉమ్మడి నల్లగొండ జిల్లాకు సరఫరా చేస్తున్నామని ప్రజలను మోసం చేశారన్నారు. ఎత్తిపోతల పథకాల పనుల నాణ్యత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తిచేయాలన్నారు. అవసరమైన చోట్ల లస్కర్లను నియమించుకోవాలని ఆదేశించారు. హుజూర్‌నగర్, కోదాడలో ఈ నెల 15న మోడల్ బస్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామన్నారు. ఆర్‌అండ్ బీ రోడ్లు, ప్రభుత్వ భవనాలు, పోలీసు భవనాలు వెం టనే పూర్తిచేయాలన్నారు. పాలేరు నీటిని మోతె, నడిగూడెం, మునగాల మండలాలకు సాగు నీరు సరఫరా చేసేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. మోతె మండలంలో 45 వేల ఎకరాలకు రూ.244 కోట్లతో ఎత్తిపోతల పథకం నిర్మిస్తామన్నారు. దీనికోసం 80 ఎకరాల భూసేకరణ చేసి వేసవి వరకు పూర్తిచేయాలన్నారు. పులిచింతల ప్రాంతంలో బ్యాక్ వాటర్‌తో ముక్త్యాల బ్రాంచ్ ఎత్తిపోతల పథకం రూ.1450 కోట్ల తో నిర్మిస్తున్నామన్నారు. 188 ఎకరాలు భూసేకరణ పూర్తి చేశామన్నారు. ఈ పథకం ద్వారా 53వేల ఎకరాలకు నీరందుతుందన్నారు. దీంతో పాటు పులిచింతల జలవిద్యుత్ ద్వారా వచ్చే నీటితో రాజీవ్‌గాంధీ ఎత్తిపోతల పథకాన్ని రూ.394 కోట్లతో నిర్మిస్తున్నామన్నారు. ఈ పథకం ద్వారా 14వేల ఎకరాలకు ఆయకట్టుకు నీరందుతుందన్నారు. హుజూర్‌నగర్, చింతలపాలెం, కోదాడ మండలాల్లోని ఆయకట్టుకు పుష్కలంగా నీరు లభించనుందన్నారు. పులిచింతల దిగువ ప్రాంతంలో పవర్ ప్లాంట్ వృథా నీటిని సద్వినియోగం చేసుకునేందుకు రాజీవ్‌గాంధీ ఎత్తిపోతల పథకాన్ని తానే రూపకల్పన చేశానన్నారు. ఇటీవల ఎన్‌ఎస్‌పీలో 1,800 మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను నియమించామన్నారు. చిన్నచిన్న ఎత్తిపోతల పథకాల ద్వారా ఆయకట్టుకు నీరందించేలా ఎత్తిపోతల పథకాలు నిర్మిస్తున్నామన్నారు. ఆర్టీసీ సర్వీసుల ద్వారా రెండు నియోజకవర్గాల్లోని పల్లెలకు రవాణా సౌకర్యం కల్పించాలని అధికారులను ఆదేశించారు.

ప్రస్తుతం నాగార్జునసాగర్, పులిచింతల, జూరాల, శ్రీ రాంసాగర్ ప్రాజెక్టులు జలకళతో ఉండటం ఆనందంగా ఉందన్నారు. సమీక్షా సమావేశంలో కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్, కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, ఎన్‌ఎస్‌పీ సీఈ రమేష్‌బాబు, మాజీ ఎమ్మెల్యే చందర్‌రావు, తలసాని శ్రీనివాసరావు, అరుణ్‌కుమార్, గూడెపు శ్రీను, వంగవేటి రామారావు, సుధీర్, తిరపమ్మ, లక్ష్మీనారాయణరెడ్డి, కొట్టె సైదేశ్వరరావు, గెల్లి రవి, దొంతగాని శ్రీనివాస్, అల్లం ప్రభాకర్‌రెడ్డి, తన్నీరు మల్లికార్జున్‌రా వు,ఈదప్పగంటి సుబ్బారావు, ఆర్టీసీ ఉన్నతాధికారి కవి త, ఆర్‌ఎం జానీరెడ్డి, పెండెం సైదులు, సుబ్బారావు, యరగాని నాగన్నగౌడ్, కోతి సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టుపై అసత్య ఆరోపణలు



కాళేశ్వరం ప్రాజెక్టుపై మాజీ మంత్రి హరీ‌ష్‌రావు హైదరాబాద్‌లో చేసిన పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ను సూర్యాపేటలో వీక్షిస్తున్న బీఆర్ఎస్ నేతలు

సూర్యాపేట(కలెక్టరేట్), ఆగస్టు 5, (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం అసత్య ఆరోపణలు చేస్తోందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి అన్నారు. హైద్రాబాద్‌లో మంగళవారం మాజీ మంత్రి హరీ‌ష్‌రావు కాళేశ్వరం ప్రాజెక్టుపై నిర్వహించిన పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ను సూర్యాపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్ర్కీన్ ద్వారా బీఆర్ఎస్ నాయకులు వీక్షించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని అనుమతులు తీసుకుని నిర్మాణం చేస్తే కావాలనే తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు ప్రధానమైందన్నారు. కుంగిన మేడిగడ్డ పిల్లర్లను మరమ్మతు చేయించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే కాలయాపన చేస్తోందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వై.వెంకటేశ్వర్లు, నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, పెరుమాళ్ల అన్నపూర్ణ, మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్, నెమ్మాది భిక్షం, జీడి భిక్షం, ముద్దం క్రిష్ణారెడ్డి, ఈదుల యాదగిరి, తాహేర్‌పాషా, సాగర్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, బత్తుల జానీయాదవ్, కటికం శ్రీను, రియాజ్ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలు



ఉత్సవమూర్తులకు అలంకరించే పవిత్ర మాలలను చూపుతున్న ప్రధానార్చకుడు కాందూరి వెంకటాచార్యులు

వివరాలు 7వ పేజీలో

మునిసిపల్ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి



ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

కోదాడ రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 142 మునిసిపాలిటీల్లో 17 మునిసిపల్ కార్పొరేషన్లలో పనిచేస్తున్న 64 వేల మంది కార్మికులను అర్హతల ఆధారంగా పర్మినెంట్ చేయాలని, కనీస వేతనాలు రూ.26 వేలు ఇవ్వాలని రాష్ట్ర మునిసిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నెమ్మాది వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో 300 మంది మునిసిపల్ కార్మికులు బీఆర్ఎస్‌కేవీ సంఘానికి రాజీనామా చేసి సీఐటీయూలో చేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు. 10గంటల పెంపు జీవో నెంబర్ 282 రద్దు చేయాలని, రెండు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న దుస్తులు, కుట్టుకూలీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పండగ పూట జనమంతా ఆనందంగా కుటుంబ సభ్యులతో జరుపుకుంటుంటే మునిసిపల్ కార్మికులు మాత్రం రోడ్లపై రోజంతా పనిచేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పండగలకు సెలవులు ఇవ్వాలని, కనీస వేతనాలు 26 వేలు ఇవ్వాలని, సంవత్సరానికి రెండు జతల దుస్తులు, చెప్పులు, కొబ్బరినూనె, సబ్బులు ఇవ్వాలని, రెండు సంవత్సరాలుగా ఉన్న పెండింగ్‌లో ఉన్న దుస్తుల కుట్టుకూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాంబాబు, జిల్లా కోశాధికారి వెంకట్ నారాయణ, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను, సహాయ కార్యదర్శి యలక సోమయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.రాములు, సోమపంగ రామకృష్ణ, వెంకటేశ్వర్‌రావు, మేడి దుర్గారావు, అనంతరం 15 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొమ్ము నాగేశ్వరరావు, కార్యదర్శి గోపి, ఉపాధ్యక్షుడు లింగమ్మ, నాగమణి, దవనం దేవిక, కమలమ్మ, ప్రసాద్, బెనర్జీ, బ్రహ్మంతో కమిటీని ఎన్నుకున్నారు. స్థానిక బస్టాండ్ నుంచి రంగా థియేటర్ వరకు కార్మిక ర్యాలీ నిర్వహించారు.

చదువుల తల్లికి అండగా యాదాద్రి కలెక్టర్

● ఉన్నత విద్యాభ్యాసానికి సహకరిస్తానని హామీ



యాదాద్రి భువనగిరి కలెక్టర్ హనుమంతరావుతో విద్యార్థిని సాత్విక

మర్కుక్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : ఆమె ఐదో తరగతిలో ఉండగా ఆయన అక్కడ ప్రత్యేకాధికారి. అప్పట్లో బాలికలోని ప్రతిభను గుర్తించిన ఆయన తాను ఎక్కడ ఉన్నా ఉన్నత విద్యాభ్యాసానికి అండగా ఉంటానని మాట ఇచ్చారు. ఇప్పుడాయన యాదాద్రిభువనగిరి జిల్లా కలెక్టర్. ఆ బాలిక ఇప్పుడు ఇంటర్‌లో 992/1000 మార్కులు సాధించి రాష్ట్రంలోనే మూడో స్థానంలో నిలిచింది. ఉన్నత చదువులు చదివే పరిస్థితి లేకపోవడంతో ఆర్థిక భరోసా కోసం అప్పుడు మాట ఇచ్చిన ఇప్పటి యాదాద్రిభువనగిరి కలెక్టర్ హనుమంతరావును కలిసింది. వివరాలు ఇలా ఉన్నాయి. యాదాద్రిభువనగిరి కలెక్టర్ హనుమంతరావు సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రత్యేక అధికారిగా ఉన్న సమయంలో మర్కుక్ మండలంలోని అంగడికిష్టాపూర్ ప్రాథమిక పాఠశాల మూతపడే దశకు చేరుకుందని హనుమంతరావు తెలుసుకున్నారు. ఊరి వాళ్లతో మాట్లాడి పిల్లలు బడికి వచ్చేలా చేసి, ఆ బడిని నిలబెట్టారు. అప్పుడు ఆ గ్రామానికి చెందిన బిళ్ల స్వాతిక అనే ఐదో తరగతి విద్యార్థిని ప్రతిభ చూసి అభినందించడంతో పాటు ఆమెకు చదవు విషయంలో అండగా ఉంటానని మాట ఇచ్చారు. ఆయన ఇచ్చిన స్ఫూర్తితో బిళ్ల సాత్విక చదువులో ముందడుగు వేసింది. పదో తరగతిలో 10కి 10 జీపీఏ సాధించింది. ఇంటర్ ఎంపీసీలో 992/1000 మార్కులతో రాష్ట్రంలో మూడు స్థానంలో నిలిచింది. మంచి కాలేజీలో ఇంజనీరింగ్ కోర్సు చదివేందుకు సీటు సంపాదించింది. కానీ, ఆమె కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంతే కావడం, ఎప్పుడో మాట ఇచ్చిన అధికారి హనుమంతరావు యాదాద్రిభువనగిరి జిల్లా కలెక్టర్‌గా ఉన్నారని తెలిసి మంగళవారం వెళ్లి కలిసింది. ఆయన విద్యార్థిని అభినందించడంతో పాటు ఆమె ఉన్నత చదువులకు అయ్యే ఖర్చును భరిస్తానని హామీ ఇచ్చారు. ఆమె వెంట గ్రామ మాజీ సర్పంచ్ దుద్దెడ రాములుగౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలకిషన్, ఉపాధ్యాయులు చిన్ని కృష, విద్యార్థిని తండ్రి శ్యాంసుందర్ ఉన్నారు.

జాతీయ రహదారిపై నిలిచిన లారీ

రాకపోకలకు అంతరాయం



తూప్రాన్‌పేట వద్ద హైదరాబాద్ వైపు నిలిచిన లారీ

చౌటుప్పల్ రూరల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి):యాదాద్రిభువనగిరి జిల్లా తూప్రాన్‌పేట వద్ద హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ఆకస్మాత్తుగా లారీ నిలిచిపోవడంతో గంటల తరబడి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ నుంచి హైదరాబాద్‌కు సిమెంట్ లోడ్‌తో వెళ్తున్న లారీ తూప్రాన్‌పేట శివారు వద్ద విజయవాడ-హైదరాబాద్ జాతీయరహదారిపై సోమవారం రాత్రి మరమ్మతులకు గురైంది. లారీ కదలని పరిస్థితిలో రోడ్డుపైనే డ్రైవర్ నిలిపాడు. దీంతో విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న వాహనాలకు తీవ్ర ఇబ్బందులు కలిగింది. గంటల తరబడి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం మధ్యాహ్నం 12గంటల వరకు వాహనాలకు తీవ్ర అంతరాయం నెలకొంది. రాత్రి ట్రాఫిక్ పోలీసులు చేరుకున్నప్పటికీ లారీ కదలకపోవడంతో రాకపోకలను నియంత్రించలేకపోయారు. ట్రాఫిక్ పోలీసులు రెండు భారీ క్రేన్లను తీసుకువచ్చి పక్కకు జరిపించి రాకపోకలను క్రమబద్ధీకరించారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు



మాలె రాంరెడ్డి

తిరుమలగిరి(సాగర్), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ తగాదాలతో ఇంట్లో నుంచి వెళ్లిన వ్యక్తి ఆచూకీ లభించకపోవడంతో కేసు నమోదు చేసినట్లు నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) ఎస్ఐ వీరశేఖర్ తెలిపారు. మంగళవారం ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అల్వాల గ్రామానికి చెందిన మాలె రాంరెడ్డి, అతడి భార్య గీత తమ వ్యవసాయ భూమిని కౌలుకు ఇచ్చే విషయంలో పరస్పరం గొడవపడినట్లు తెలిపారు. గొడవ అనంతరం భార్య మధ్యాహ్నం ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో రాంరెడ్డి గది బయటి నుంచి గడియపెట్టి భార్యకు చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. అనంతరం భార్య నిద్ర నుంచి లేచి భర్త గురించి వెతుకుతుండగా భర్త ద్విచక్రవాహనం పొలం వద్ద ఉందని తెలిసింది. వెళ్లి చూడగా అక్కడ ఆయన కనిపించలేదు. దీంతో అదృశ్యమైన రాంరెడ్డి గురించి అతడి భార్య గీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. అదృశ్యమైన వ్యక్తి విషయమై ఎవరికైనా సమాచారం తెలిస్తే 8712670199 నెంబర్‌కు సమాచారం అందిచాలన్నారు.

షూటింగ్‌లో వెన్నెలకు రాష్ట్రస్థాయి మొదటి ర్యాంకు

చిలుకూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): స్వదేశ్ షూటింగ్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఇటీవల కరీంనగర్ జిల్లాలో నిర్వహించిన షూటింగ్ పోటీల్లో సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం బేతవోలు గ్రామానికి ఆర్టీసీ కండక్టర్ బెల్లంకొండ వీరయ్య కుమార్తె వెన్నెల రాష్ట్రస్థాయి మొదటిర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా వెన్నెలను బంధువులు, గ్రామస్థులు అభినందించారు.

అవార్డుల పుట్టపాక

● రాష్ట్ర ప్రభుత్వ కొండా లక్ష్మణ్‌బాపూజీ అవార్డులకు ముగ్గురి ఎంపిక

రాష్ట్ర ప్రభుత్వం చేనేత రంగంలో విశేష ప్రతిభ కనబరుస్తున్న చేనేత కార్మికులను ప్రోత్సహించేందుకు ప్రతీ ఏడాది కొండా లక్ష్మణ్‌బాపూజీ పేరిట అవార్డులను ప్రదానం అందజేస్తోంది. అందులో భాగంగా ఈ ఏడాదికి యాదాద్రిభువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండలం పుట్టపాక చేనేత కార్మికులు సామల భాస్కర్, గూడ పవన్, కొలును శంకర్‌లలు అవార్డులకు ఎంపికయ్యారు. చేనేత దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం వీరికి అవార్డుల ప్రదానం అందజేస్తుంది.

(ఆంధ్రజ్యోతి-సంస్థాన్‌నారాయణపురం)



తాను తయారు చేసిన చీరతో శంకర్

చేనేత రంగంలో పుట్టపాక గ్రామం తెలియని వారుండరు. ఇక్కడి కార్మికులు నేసిన పట్టువస్త్రాలకు అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్రస్థాయిలో ఎన్నో అవార్డులు వరించాయి. కేంద్రప్రభుత్వం ప్రకటించే ప్రతిష్ఠాత్మక పద్మశ్రీ అవార్డులను సైతం చేనేతరంగం నుంచి మొదటిసారి ఈ గ్రామానికి చెందిన కార్మికులకు దక్కడం విశేషం. కేంద్ర ప్రభుత్వం ప్రకటించే చేనేత జాతీయ పురస్కారాలకు ఈ గ్రామ చేనేతకార్మికులు లేకుండా అవార్డు జాబితా ఉండదంటే అతిశయోక్తి కాదు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం అందించే కొండా లక్ష్మణ్‌బాపూజీ అవార్డులకు సైతం ఎంపికయ్యారు.

ప్రత్యేక రూపకల్పనతో

పుట్టపాకకు చెందిన కొలను శంకర్ సిల్క్, లెనిన్ కాటన్‌తో డబుల్ ఇక్కత్ పద్ధతిలో రాజ్‌కోట్ ప్రత్యేక చీరలను రూపొందించారు. ఇందులో కలర్ డిజైన్‌ను ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. విభిన్న పద్ధతులతో తయారుచేసిన ఈ చీరను ప్రభుత్వం కొండా లక్ష్మణ్‌బాపూజీ అవార్డుకు ఎంపిక చేసింది.

సాధారణ చీరలకు భిన్నంగా

మార్కెట్‌లో తయారయ్యే సాధారణ చీరల విక్రయాలు సరిగ్గా లేక చేనేత కార్మికుల జీవనోపాధి కష్టంగా మారింది. వీటిని దృష్టిలో పెట్టుకుని వినూత్నంగా చీరలను తయారు చేయాలని సామల భాస్కర్ ఆలోచించారు. అందులో భాగంగా నెమలి దేవత గల నమూనా చీరలను రూపొందించారు. ఈ చీర కొంగుకు 1000 మెట్లతో, మిగతా చీరకు 450 మెట్లతో వినూత్నంగా తయారుచేశారు. నిలువు సాధారణంగా, అడ్డం 3డీ మాదిరిగా నాలుగు అచ్చులతో ప్రత్యేకంగా రూపొందించారు. అంతేకాకుండా టస్సారు ఎల్లో, గ్రీన్, బ్రౌన్, రాయల్ బ్లూ, రెడ్ బ్లాక్‌లాంటి ఏడు రంగులను అద్ది ప్రత్యేకంగా చీరలు తయారు చేశారు.



చీరను ప్రదర్శిస్తున్న సామల భాస్కర్

ప్రకృతి రంగులతో అందమైన వస్త్రం

పుట్టపాక గ్రామానికి చెందిన గూడ పవన్ డబుల్ ఇక్కత్‌తో అందమైన చీరలను ఆవిష్కరించారు. బంతిపూలు, దానిమ్మ పండ్లు, వేర్లు వన మూలికలతో తయారు చేసిన సహజసిద్ధ రంగులను మల్బరి పట్టుదారానికి అద్ది జాతీయ, భౌగోళిక గుర్తింపు పొందిన తేలియా రుమాలుతో పట్టుచీరను తయారు చేశారు. 16 ఆకృతులు అద్ది మడతలు పడకుండా చీరను రూపొందించారు. ఈ చీర తయారు చేయడానికి పవన్ ఆరు నెలల పాటు శ్రమించారు. ఈ చీర ఖరీదు రూ.75 వేల వరకు ఉంటుందని తెలిపారు. ఎనిమిది సంవత్సరాలుగా చేనేతలో విభిన్న రకాలుగా శ్రమిస్తూ ఎన్నో నూతన నమూనాలను తయారు చేయడంతో పాటు తాజాగా ఈ వస్త్రాన్ని తయారు చేసి రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపికయ్యారు. కాగా పవన్ ఇదే చీరను తయారు చేసినందుకు జాతీయ చేనేత అవార్డుకు ఎంపికయ్యారు.



తేలియా రూమల్ చీరను తయారు చేస్తున్న గూడ పవన్

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మహిళలు మృతి



అర్థం కృష్ణవేణి (ఫైల్)

నార్కట్‌పల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొట్టడంతో ఓ మహిళ దుర్మరణం చెందింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండల కేంద్రంలో సోమవారం రాత్రి జరిగింది. ఎస్ఐ దగ్గుల క్రాంతికుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నార్కట్‌పల్లి పట్టణానికి చెందిన అర్థం కృష్ణవేణి(58) పాల ప్యాకెట్ తేవడానికి ఇంటి నుంచి రోడ్డు దాటుతుండగా అదే సమయంలో కామినేని వైపు నుంచి నార్కట్‌పల్లి వైపునకు అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చిన కారు ఢీకొట్టింది. దీంతో కృష్ణవేణి తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే అంబులెన్స్‌లో నార్కట్‌పల్లిలోని కామినేని ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స చేసిన వైద్యులు ఆమెను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించాలని సూచించారు. ఆమేరకు తరలిస్తుండగా మార్గమధ్యలోనే కృష్ణవేణి మృతి చెందింది. కృష్ణవేణి అల్లుడు బెలిదే నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైలు పట్టాలు దాటుతుండగా

వలిగొండ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి):రైల్వేపట్టాలు దాటుతున్న వృద్ధురాలిని రైలు ఢీకొట్టడంతో మంగళవారం అక్కడికక్కడే దుర్మరణం చెందింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం యాదాద్రిభువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం ఖాజీపూర్ గ్రామానికి చెందిన గుళ్లని పోచమ్మ(92) మంగళవారం వలిగొండ మండలం ఎదుల్లాగూడెం గ్రామంలో తమ బంధువుల ఇంటికి రావడానికి స్టేజీ వద్ద బస్సు దిగింది. నడుచుకుంటూ వస్తోంది. సోమవారం కురిసిన వర్షానికి ఆ గ్రామ సమీపంలో రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి కింద భారీగా నీరు నిలిచింది. దీంతో పోచమ్మ నీటిలో నుంచి నడవలేని పరిస్థితిలో ప్రత్యామ్నాయంగా రైల్వే పట్టాల పైనుంచి నడుచుకుంటూ వెళ్తోంది. అప్పుడే అటుగా వెళ్తున్న రైలు ఆమెను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పోచమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. మృతదేహం ఛిద్రమైంది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

కాపాడిన ఎయిర్ బెలూన్‌లు

చౌటుప్పల్‌రూరల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం బొర్రోళ్లగూడెం శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు ఎయిర్ బెలూన్స్ ఓపెన్ కావడంతో ఇద్దరు బయటపడగా, ఓ మహిళ మృతి చెందింది. సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా జరుగుమల్లి మండలం చిర్రుకూరపాడు గ్రామానికి చెందిన మదిరాల గోవిందమ్మ(64) కుమారుడు ప్రవీణ్‌కుమార్, కోడలు సుమతితో కలిసి నూతనంగా కొనుగోలు చేసిన కారులో హైదరాబాద్‌కు బయలుదేరారు. బొర్రోళ్లగూడెం రాగానే రోడ్డుపై అజాగ్రత్తగా నిలిపిన లారీని అదుపుతప్పి వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో వెనుక సీట్‌లో కూర్చున్న గోవిందమ్మకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే దుర్మరణం మృతి చెందింది. సీట్‌బెల్టు ధరించడంతో బెలూన్ ఓపెన్‌కావడంతో కుమారుడు, కోడలు ప్రమాదం నుంచి బయటపడ్డారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

మోటార్ల దొంగల ముఠా అరెస్టు



సమావేశంలో దొంగల వివరాలను వెల్లడిస్తున్న ఏఎస్పీ రమేశ్

కట్టంగూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ బావుల వద్ద బోరు మోటార్లు, బ్యాటరీలను చోరీ చేస్తున్న ముఠాను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు నల్లగొండ జిల్లా అదనపు పోలీస్ సూపరింటెండెంట్ జీ.రమేశ్ తెలిపారు. నల్లగొండ డీఎస్పీ కొలను శివరాం రెడ్డితో కలిసి మంగళవారం కట్టంగూరు పోలీసు స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన నిందితులను ప్రవేశపెట్టి వివరాలను వెల్లడించారు. నకిరేకల్ ప్రాంతానికి చెందిన ఎడ్ల సురేశ్, నాగిళ్ల ముత్తయ్య, గోపగాని రమేశ్, ఆవుల రాజాలు, నాగిళ్ల ఎల్లయ్యలు సమీప బంధువులు. వీరిలో మొదటి సురేశ్, ముత్తయ్య, రమేశ్‌లు గతంలో తిప్పర్తి సమీపంలోని రైల్వేశాఖకు సంబంధించిన బ్యాటరీలను చోరీ చేసిన కేసులో జైలు జీవితం కూడా అనుభవించారు. అయినా వారు తమ ప్రవర్తనను మార్చుకోకుండా మిగతా ఇద్దరితో కలిసి వ్యవసాయ బావులు, నిర్జనంగా ఉండే ఫాంహౌజ్‌లను ఎంచుకుని మోటార్లు, బ్యాటరీలతో పాటు ఇతర వస్తువులను చోరీలకు పాల్పడ్డారు. వీరిని పట్టుకునేందుకు పోలీసులు కూడా బృందాలుగా ఏర్పడి గాలిస్తుండగానే విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం కట్టంగూరు ఎస్ఐ రవీందర్ తన సిబ్బందితో కలిసి హైవేపై అప్రమత్తమయ్యారు. మోటార్లు, బ్యాటరీల లోడుతో వెళ్తున్న ఏపీ27వై-5920 నెంబర్ గల ఆటోను నిలిపి అందులోని ఐదుగురు నిందితులను విచారించగా వాటిని చోరీ చేసి విక్రయించేందుకు హైదరాబాద్‌కు తీసుకువెళ్తున్నట్లు అంగీకరించారని తెలిపారు. కట్టంగూరు మండలం ఈదులూరు శివారులోని వెంకటేశ్వర డెయిరీ ఫాంహౌస్‌లో, అయిటిపాములలోని ఎస్ఎల్‌బీసీ కాల్వ వద్ద రెండు మోటార్లు, శాలిగౌరారం మండల పరిధిలో 2 మోటార్లు చోరీ చేశారని ఈ మోటార్ల విలువ రూ.13.61లక్షలు ఉంటుందన్నారు. మొత్తం 5 నేరాలకు సంబంధించి 14 మోటార్లు, 33 బోరు పైపులు, 8 బ్యాటరీలతో పాటు ఇతర కొన్ని వస్తువులు వీటిని తరలించేందుకు ఉపయోగించిన ఆటోను సీజ్ చేసి, రూ.1.74లక్షల నగదును స్వాధీనం చేసుకున్నామని ఏఎస్పీ తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ ఆధ్వర్యంలో ఈ నేరస్తులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి, కట్టంగూరు ఎస్ఐ రవీందర్, సిబ్బంది బండి గిరి, శంకర్, రామ్మోహన్, సుధాకర్‌లను ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అభినందించినట్లు తెలిపారు.

వైద్యం వికటించడంతో మృతి చెందాడని ఆందోళన



ఎస్ఐ ప్రవీణ్‌కుమార్‌తో మాట్లాడుతున్న బాధిత బంధువులు, గ్రామస్థులు

మునగాల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : వైద్యం వికటించడంతోనే వ్యక్తి మృతి చెందాడని, ఆర్ఎంపీ వైద్యుడిని వెంటనే అరెస్టు చేయాలని సూర్యాపేట జిల్లా మునగాల పోలీస్‌స్టేషన్ ఎదుట మంగళవారం రాత్రి బాధితుడి బంధువులు, గ్రామస్థులు ఆందోళన చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని బరాఖత్‌గూడెం గ్రామానికి చెందిన గోవింద వెంకటేశ్వర్లు(35) జ్వరంతో బాధపడుతూ మంగళవారం ఉదయం 10గంటలకు భార్య శిరీషతో కలసి ద్విచక్రవాహనంపై మునగాలలోని గ్రామీణ వైద్యుడు చంద్రమౌళి ఆసుపత్రికి వచ్చారు. అక్కడ ఆయనకు రక్త పరీక్షలు చేసి వైద్యం అందించారు. అదే ఆస్పత్రిలో సాయంత్రం 4 గంటల సమయంలో వెంకటేశ్వర్లు అపస్మారకస్థితిలోకి వెళ్లాడని, గమనించిన కాంపౌండర్లు వెంటనే కోదాడకు తీసుకెళ్లాలని వాహనంలో పంపించారు. మార్గమధ్యలోనే వెంకటేశ్వర్లు మృతి చెందాడని బంధువులు తెలిపారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్యుడిపై చర్యలు తీసుకోవాలని బంధువులు ఆసుపత్రి వద్ద ఆందోళన చేశారు. అక్కడ ఎవరూ స్పందించకపోవడంతో రాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలో స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన దిగారు. ఏ ఇంజెక్షన్లు ఇచ్చారో విచారించాలని బంధువులు పోలీసులను వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు గోవింద వీరబాబు, నాగరాజు, రామారావు, రమేష్, గోపీలు డిమాండ్ చేశారు. ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. సుమారు అరగంటకు పైగా ఆందోళన కొనసాగింది. ఇదిలా ఉండగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నడిగూడెం, మోతె ఎస్ఐలతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

14 వంట గ్యాస్ సిలిండర్లు సీజ్

భూదాన్‌పోచంపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలంలో అక్రమంగా వినియోగిస్తున్న 14 వంట సిలిండర్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దారు బాలమణి, ఆర్ఐ నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని వివిధ హోటళ్లను, చికెన్‌సెంటర్లను తనిఖీలు నిర్వహించారు. కమర్షియల్ సిలిండర్లకు బదులుగా సబ్సిడీ వంట గ్యాస్ సిలిండర్లను వినియోగించడం గుర్తించారు. వారి నుంచి 14 సిలిండర్లను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు.

చోరీకి యత్నిస్తుండగా పట్టివేత

భువనగిరి టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రం భువనగిరి పట్టణం కామునికాంతలో చోరీకి యత్నిస్తున్న వ్యక్తిని స్థానికులు పట్టుకున్నారు. కామునికాంతకు చెందిన నాయిని విద్యాసాగర్ సొంతిల్లు శిథిలావస్థకు చేరడంతో తాళం వేసి కుటుంబంతో స్థానిక హెచ్‌బీ కాలనీలో అద్దెకు ఉంటున్నాడు. ఇదే అదునుగా రహదారుల వెంట ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరించే ఓ గుర్తుతెలియని వ్యక్తి మంగళవారం ఆ ఇంట్లోకి బలవంతంగా ప్రవేశించి అందులోని ఇత్తడి సామాగ్రిని చోరీ చేసేందుకు ప్రయత్నించాడు. గమనించిన స్థానికులు పట్టుకొని పోలీసులకు సమాచారమిచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఇంటి యజమాని ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

నిడమనూరులో సబ్‌కోర్టు ఏర్పాటుకు కృషి

లోకాయుక్త చైర్మన్ జస్టిస్ రాజశేఖర్‌రెడ్డి



నిడమనూరు కోర్టులో మాట్లాడుతున్న జస్టిస్ రాజశేఖర్‌రెడ్డి

నిడమనూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): నిడమనూరులో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టుతో పాటు సబ్‌కోర్టు ఏర్పాటుకు కృషి చేస్తానని లోకాయుక్త చైర్మన్, హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ యడవల్లి రాజశేఖర్‌రెడ్డి హామీ ఇచ్చారు. మంగళవారం నల్లగొండ జిల్లా నిడమనూరు మున్సిఫ్‌కోర్టును ఆయన సందర్శించారు. ఆయనకు న్యాయమూర్తి టీ.స్వప్న పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. బార్ అసోసియేషన్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిడమనూరు కోర్టులో కేసుల తీవ్రత దృష్ట్యా అదనపు జూనియర్ సివిల్ కోర్టుతో పాటు సబ్‌కోర్టు ఏర్పాటు అవసరం ఉందన్నారు. కేసుల సత్వర పరిష్కారానికి న్యాయవాదులు కృషి చేయడంతో పాటు కక్షిదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. నిడమనూరు కోర్టు భవన నిర్మాణం బాగుందని, అధునాతన వసతులతో రాష్ట్రంలోనే రోల్ మోడల్‌గా నిలుస్తుందన్నారు. అదనపు కోర్టుల ఏర్పాటు కోసం న్యాయవాదులు ఆయనకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఎంసీ.కోటిరెడ్డి, వీపీ సాధన, న్యాయవాదులు ఉన్నం చినవీరయ్య, ముప్పా అరుణ్‌కుమార్, బొల్లం శ్రీనివాస్, పెద్దబోయిన శ్రీనివాస్, చెన్ను సుందర్‌రెడ్డి, భగవాన్‌నాయక్, రమణారెడ్డి, రఘురామారావు, కత్తి స్వర్ణలత, వినోద్, రవి, లలిత, యామిని, మేఘారెడ్డి, కోటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం

దేవరకొండ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దేవరకొండ డివిజన్‌లో కొన్నేళ్లుగా ప్రభుత్వ, వక్ఫ్‌బోర్డు భూములు కబ్జాలకు గురవుతూనే ఉన్నాయి. భూఆక్రమణలపై కలెక్టర్, లోకాయుక్తాకు ప్రజలు ఫిర్యాదు చేస్తున్నప్పటికీ భూఆక్రమణలు ఆగడంలేదు. వక్ఫ్‌బోర్డు భూములు, డిండి మండల కేంద్రంలో నీటిపారుదలశాఖ భూములు, కొండమల్లేపల్లి మండలం కొల్‌ముంతలపహడ్ 202 సర్వేనెంబర్‌లో భూఆక్రమణలు జరుగుతున్నాయి. ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేస్తున్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. భూముల ధరలు రోజు, రోజుకు పెరిగిపోతుండడంతో ఆక్రమణలకు పాల్పడుతున్నారు. దేవరకొండ మండలం కాసారంలో సర్వేనెంబర్ 13లోని ప్రభుత్వ, వక్ఫ్‌బోర్డు భూములను ఆక్రమించుకుని సొమ్ము చేసుకుంటున్నారు.

తాత్కాలిక చర్యలు

2014 నుంచి దేవరకొండలో 750, 753 సర్వేనెంబర్‌లలో వక్ఫ్‌బోర్డు భూములు ఆక్రమణకు గురవుతూనే ఉన్నాయి. జిల్లా వక్ఫ్‌బోర్డు అధికారులు దేవరకొండలో విచారణ జరిపి నోటీసులు జారీ చేసి వెళ్తున్నారే తప్ప ఎలాంటి చర్యలు చేపట్టడంలేదు. కొండమల్లేపల్లి మండలం కొల్‌ముంతలపహడ్‌లో 202 సర్వేనెంబర్‌లో ప్రభుత్వ భూములు ఆక్రమిస్తున్నారన్న ఫిర్యాదులు చేస్తే రెవెన్యూ అధికారులు అక్రమ కట్టడాలను తాత్కాలికంగా తొలగిస్తున్నారే తప్పా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. డిండి మండల కేంద్రంలో నీటిపారుదలశాఖకు చెందిన 400 ఎకరాల భూముల్లో 50 ఎకరాలకుపైగా అన్యాక్రాంతమైనట్లు అధికారులకు ఫిర్యాదులు అందాయి.



దేవరకొండలో ఆక్రమణకు గురవుతున్న వక్ఫ్‌బోర్డు భూములను పరిశీలిస్తున్న మున్సిపల్, వక్ఫ్‌బోర్డు, రెవెన్యూ అధికారులు (ఫైల్)



కొల్‌ముంతలపహడ్ జాతీయ రహదారి పక్కన చేపట్టిన అక్రమ నిర్మాణాలు

దేవరకొండలో 227 మందికి నోటీసులు జారీ

దేవరకొండలో 753 సర్వేనెంబర్‌లో అక్రమ నిర్మాణాలు జరిపారని విచారణ జరిపి జిల్లా వక్ఫ్‌బోర్డు అధికారులు 227 మందికి నోటీసులు జారీ చేశారు. కాని ఎలాంటి చర్యలు చేపట్టలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. తాజాగా 753 సర్వేనెంబర్ వక్ఫ్‌బోర్డు భూములలో అక్రమ కట్టడాలు జరుగుతున్నాయని స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో దేవరకొండ తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ మహమూద్, దేవరకొండ మునిసిపల్ కమిషనర్ సుదర్శన్ ఆధ్వర్యంలో పోలీసులతో కలిసి అక్రమ కట్టడాలను తొలగించారు. భూములను ఆక్రమించుకొని అక్రమ కట్టడాలు నిర్మిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు. ఇలాంటి సంఘటనలు దేవరకొండ డివిజన్‌లో కొన్నేళ్లుగా కొనసాగుతూనే ఉన్నాయి. ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్నవారిపై చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఆక్రమణలకు పాల్పడితే చర్యలు



ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే డివిజన్‌లో ప్రభుత్వభూములను గుర్తించి హద్దులు ఏర్పాటుచేశాం. ప్రభుత్వ వక్ఫ్‌బోర్డు భూములను ఆక్రమించుకున్నవారికి ఇప్పటికే నోటీసులు జారీ చేశాం.

రమణారెడ్డి, ఆర్డీవో, దేవరకొండ

ప్రజాహితం కోసం కృషిచేయాలి



జస్టిస్ శివశంకర్‌రావుకు మొక్క అందజేస్తున్న వర్రె వెంకటేశ్వర్లు

మోత్కూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పోలీస్ వ్యవస్థ ప్రజాహితం కోసం పని చేసేలా కృషిచేయాలని రాష్ట్ర పోలీస్ కంప్లైంట్స్ అథారిటీ చైర్మన్ జస్టిస్ బి. శివశంకర్‌రావు అన్నారు. రాష్ట్ర హోంశాఖ కార్యదర్శి రవిగుప్తా, డీజీపీ డాక్టర్ జితేందర్, అడిషనల్ డీజీపీ(లాఅండ్ ఆర్డర్)మహేష్ ఎం. భగవత్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పోలీస్ వ్యవస్థలో ఉన్న లోపాలను సవరించి పోలీస్ వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పోలీస్ కంప్లైంట్స్ అథారిటీ సభ్యులు డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు, పి. ప్రమోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

నల్లగొండ టౌన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కోర్సులో చేరేందుకు స్పాట్ అడ్మిషన్లు చేపడుతున్నట్టు ప్రభుత్వ గవర్నమెంట్ పాలిటెక్నిక్ నల్లగొండ ప్రిన్సిపాల్ సీహెచ్ నరసింహారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో వివిధ ఇంజనీరింగ్ బ్రాంచ్‌లలో స్పాట్ అడ్మిషన్ల ద్వారా ఖాళీలు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. డిప్లమో చేయాలని ఆసక్తి కలిగి ప్రవేశ పరీక్ష రాసి సీటుపొందని వారు, ప్రవేశ పరీక్ష రాయకుండా నేరుగా చేరాలనుకునే విద్యార్థులకు మంచి అవకాశమని తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 5వ తేదీ నుంచి 7వ తేదీ వరకు కళాశాల కార్యాలయంలో స్వీకరించి, సంబంధిత ధ్రువీకరణపత్రాలు జతచేసి అందజేయాలని కోరారు. ఈ నెల 8వ తేదీన ఉదయం 10 గంటల నుంచి స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సంప్రదించాలని కోరారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

హాలియా, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లాకేంద్రంలోని మేకల అభినవ్ స్టేడియంలో జూలై 20న జరిగిన జిల్లా అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్(600) మీటర్స్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన హాలియా మున్సిపాలిటీలోని ఆకాంక్ష ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి ఆర్. పవన్‌కుమార్ రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. ఈ నెల 6,7 తేదీల్లో జనగాం జిల్లాలో జరిగే పోటీల్లో పాల్గొనున్ననట్లు ప్రిన్సిపాల్ మోదాల రవీందర్ తెలిపారు. విద్యార్థిని కరస్పాండెంట్ మేడేపల్లి మోహన్‌రావు, డైరెక్టర్ ఉన్నం శ్రీనుబాబు, పీఈటీ ఆవుల చంద్రశేఖర్ అభినందించారు.



విద్యార్థిని అభినందిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

మూడు ఇసుక లారీల పట్టివేత

కేతేపల్లి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా ఏపీ నుంచి 65వ నెంబరు జాతీయ రహదారి మీదుగా హైదరాబాద్‌కు ఇసుక తరలిస్తున్న మూడు లారీలను నల్లగొండ జిల్లా కేతేపల్లి పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. ఎస్ఐ సతీష్‌వర్మ సిబ్బందితో మండలంలోని కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. వాడపల్లి నుంచి హైదరాబాద్‌కు ఇసుకను తరలిస్తున్న మూడు లారీలు పట్టుబడ్డాయి. అనుమతి లేకపోవడంతో ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

అవగాహన కల్పిస్తే ప్రయోజనం



- నానో యూరియా, డీఏపీ పట్ల ఆసక్తి చూపని రైతులు
- దుక్కిలో కాకుండా చేలకు పిచికారీ చేస్తే ప్రయోజనం
- ధర తక్కువ.. ప్రయోజనం ఎక్కువంటున్న శాస్త్రవేత్తలు

ఉమ్మడి నల్లగొండ జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఈ సీజన్‌లో యూరి యా కొరత తీవ్రంగా ఉంది. ఉమ్మడి నల్లగొండ జిల్లా లో వర్షాలు ఎక్కువగా లేక వరి నాట్లు ముమ్మరంగా సాగడం లేదు. బావులు, బోర్ల కింద సాగు చేసిన కొద్దిపాటి వరి నాట్లకు, ఇతర మెట్ట పంటలకు వేద్దామన్నా యూరియా దొరకడం లేదు. బస్తా రూ.266.50 విక్రయించాల్సిన యూరియాను పలుచోట్ల రూ. 350 వరకు అమ్ముతున్నారు. లేదా ఏదో ఒకటి లింక్ పెట్టి అమ్ముతున్నారు. లింక్ పెట్టి ఇచ్చిన దాంతో రైతుకు ప్రయోజనముండదు.

● ఆంధ్రజ్యోతి, మోత్కూరు.

యూరియా కోసం రోజుల తరబడి వేచి చూస్తున్నారు, గంటలకు గంటలు లైన్‌లో నిల్చొని, ఎక్కువ ధర అయినా సరే యూరియా తీసుకెళ్తున్నారు. తప్ప అందుబాటులో ఉన్న నానో యూరియా(లిక్విడ్) వాడడం లేదు. నానో యూరియా, డీఏపీ ధర తక్కువగా ఉంది. బస్తా యూరియా ధర రూ.266.50 కాగా నానో యూ రియా అర లీటర్ ధర రూ.225. బస్తా డీఏపీ ధర రూ.1350 కాగా నానో డీఏపీ అర లీటరు ధర రూ .600. అది ఒక్క బస్తా వేసే బదులు అర లీటర్ నా నో పిచికారీ చేస్తే సరిపోతుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. దుక్కిలో వేసేప్పుడు మాత్రం క్రిస్టల్ యూరియా, డీఏపీనే వేయాలని, చేలకు వేసేప్పుడు మాత్రం నానో యూరియా, డీఏపీ పిచికారీ చేస్తే మొక్కలకు బాగా పనిచేస్తుందని చెబుతున్నా రు. మొక్కలకు వేసేప్పుడు భూమిలో వేసిన ఎరువును మొక్క పూర్తిగా తీసుకోలేదని, ఎక్కువ శాతం ఎరువు వృథా అవుతుందంటున్నారు. నానో పిచికారీ చేస్తే మొక్కల ఆకులు పూర్తిగా దాన్ని వినియోగించుకుంటాయని చెబుతున్నారు శాస్త్రవేత్తలు.

అవగాహన లేమి

రైతులకు నానో యూరియా, డీఏపీ పట్ల అవగాహన ఎక్కువగా లేదు. నానో యూరియా, డీఏపీ తయారు చేసిన ఎరువుల కంపెనీలు వాటిని విక్రయించాలని ఎరువుల దుకాణాల వ్యాపా రులకు యూరియా, డీఏపీ బస్తాలు ఇచ్చినప్పుడు అంటగడుతున్నారు కానీ, వాటి వాడకంపై రైతులకు సరైన అవగాహన కల్పించడం లేదన్న ఆరోపణలు వినిపిన్నాయి. వ్యవసాయ శాఖ అధికారులు కూడా నానో యూరియా,డీఏపీ వాడకం, వాటి ఫలితాలపై పెద్దగా ప్రచారం చేస్తున్న దాఖలాలు లేవు. ఎరువులు వెక్కువగా వెదజల్లడం, గుంటుకతోలేప్పుడు గొట్టాల ద్వారా పోయడం చేస్తున్నారు. అలా ఎరువు కొంత వృథా అవుతున్నప్పటికీ ఎరువు వేయడం సులువుగా ఉంటుంది. పిచికారి చేయడం కొంత కష్టమని రైతులు నానో యూరియా, డీఏపీ పిచికారి చేయడానికి ఆసక్తి చూపడం లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా రైతులు మొక్కలకు యూరియా, డీఏపీ వేయకుండా నానో యూరియా, డీఏపీ పిచికారీ చేయాలని వ్యవసాధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

నానో యూరియా, డీఏపీ వాడితే ప్రయోజనం ఎక్కువ



దుక్కిలో వేసేప్పుడు సాధారణ ఎరువులు, యూరియా వేసుకోవాలి. మొక్కలు ఎదగడానికి ఎరువులు వేయాల్సి వచ్చినప్పుడు నానో యూరియా, డీఏపీ పిచికారీ చేయాలి. అలా పిచికారీ చేస్తే ఎరువు వృథా కాకుండా సద్వినియోగమవుతుంది. పిచికారి చేయడం కష్టమని రైతులు క్రిస్టల్ ఎరువులు, యూరియా తీసుకెళ్లి వెదజల్లడానికి అలవాటు పడ్డారు. అలా చేయడం వల్ల ఎరువు కొంత వృథా అవుతుంది. నానో పిచికారీ చేయడం వల్ల కష్టానికి తగిన ఫలితం ఉంటుంది. ఇప్పుడిప్పుడే కొన్ని కంపెనీలు రైతులకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాయి.

- డాక్టర్ అనిల్‌కుమార్, కేవీకే శాస్త్రవేత్త, యాదాద్రిభువనగిరి జిల్లా.

మార్కెట్లోకి వచ్చి మూడేళ్లు

ఎరువుల కంపెనీలు సుమారు మూడేళ్లగా నానో(లిక్విడ్) యూరియా, డీఏపీ తయారు చేసి మార్కెట్లో విక్రయిస్తున్నాయి. అయినా రైతులు క్రిస్టల్ యూరియా, డీఏపీనే వాడుతున్నారు తప్ప నానో యూరియా, డీఏపీ వాడటం లేదు. ఒక్కో ఎరువుల దుకాణం ఒక్కో సీజన్‌కు 15లోడ్ల (200నుంచి 300 మెట్రిక్ టన్నులు యూరియా, డీఏపీ అమ్ముతుండగా నానో యూరియా, డీఏపీ ఒక్క కాటన్ (పది లీటర్లు)కూడా అమ్ముడు పోవడం లేదని ఎరువుల వ్యాపారులు చెబుతున్నారు. నానో యూరియా, డీఏపీ ఎమ్మార్పీ రేటు తగ్గించి ఇవ్వడానికి కూడా సిద్ధంగా ఉన్నామని పలువురు ఎరువుల వ్యాపారులు పేర్కొంటున్నారు.

శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలు



ప్రాకార మండపంలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి సన్నిధిలో రెండో రోజు మంగళవారం శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలు కొనసాగాయి. పండితుల వేద మంత్రోచ్ఛరణల నడుమ ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాలు మార్మోగుతుండగా ఆగమశాస్త్రరీతిలో ఉదయం నవకలశ స్నపన తిరుమంజనం, యాగశాలలో ద్వార తోరణ పూజ, కుంభారాధన, చక్రాబ్జ మండలారాధన, అగ్ని ప్రతిష్ఠ, చేపట్టిన అర్చకులు హోమాది పూజలు వైభవంగా నిర్వహించారు. నిత్య కైంకర్యాలు, చతుఃస్థానార్చనలు హోమం చేపట్టి, మూలమంత్ర పారాయణాలు, పంచసూక్తాలతో 108 నూలు పోగులకు అభిషేకం చేసి మాలలను తీర్చిదిద్దారు. సాయంత్రం ఆరాధన, ద్వారపూజ, మూర్తి మంత్ర విశేష హోమాలు, స్వర్ణమయ దివ్య విమాన సుదర్శ చక్రారాధన, ఆవాహనం చేసి అభిషేకించి, ఏటా ఒక రోజు వేసే పూలమాల వేశారు. ఉదయం, సాయంత్రం, పంచసూక్త, మూలమంత్ర హోమాలు చతుఃస్థానార్చనలు అనుబంధ పాతగుట్ట ఆలయంలో కూడా పాంచరాత్రాగమ రీతిలో పవిత్రోత్సవాలు నిర్వహించారు. వేడుకల్లో ఆలయ ఈవో ఎస్.వెంకట్రావు, అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి, ఏఈవో జూశెట్టి కృష్ణ, గజ్వేల్లి రమేష్‌బాబు, పర్యవేక్షకులు జి.శంకర్‌నాయక్, నాగుల మహేష్‌గౌడ్ పాల్గొన్నారు.

నేటితో పవిత్రోత్సవాల పరిసమాప్తి

రెండు రోజుల పాటు సాగిన పవిత్రోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం మహాపూర్ణాహుతి, స్వామిఅమ్మవారలు, ఆళ్వార్లకు పవిత్రాధారణతో ఉత్సవాలు పరిసమాప్తి కానున్నట్లు ప్రధానార్చకుడు కాండూరి వెంకటాచార్యులు తెలిపారు.

క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు

యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్ర పాలకుడు ఆంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, నిత్యార్చనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. కొండపైన విష్ణుపుష్కరిణి వద్ద ఆంజనేయస్వామికి ఆలయంలో అర్చకులు వేద మంత్ర పఠనాలతో పంచామృతాభిషేకం చేసిన తమలపాకులు, సింధూరం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఆంజనేయుడికి సహస్రనామ పఠనాలతో నాగవల్లీ దళార్చనలు నిర్వహించి హారతి ఇచ్చారు. ప్రధానాలయంలో స్వయంభువులను సుప్రభాత సేవలతో మేల్కొలిపి గర్భాలయంలో నిజాభిషేకం, నిత్యార్చనలు, సువర్ణ పుష్పార్చనలు పాంచారాత్రగమ శాస్త్రరీతిలో నిర్వహించారు. శివాలయంలో పర్వతవర్ధిని రామలింగేశ్వర స్వామికి ముఖ మండపంలోని స్ఫటిక మూర్తులకు నిత్య పూజలు, నిత్య రుద్రహవనం శైవాగమన పద్ధతిలో కొనసాగాయి. పాతగుట్ట ఆలయంలో ఆంజనేయస్వామిని పంచామృతాలతో అభిషేకించి ఆకుపూజ చేపట్టారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.15,82,026 ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు.

సర్వే పనులపై సిబ్బందికి అవగాహన

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ భూముల సర్వే పనులు మంగళవారం కూడా కొనసాగాయి. వైటీడీఏ పరిధిలో ఆలయ భూముల గుర్తింపుకు ఈ నెల 2న అదనపు కలెక్టర్ జి. వీరారెడ్డి, భువనగిరి ఆర్డీవో మాలి క్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో సర్వే పనులు టెంపుల్ సిటీ ప్రాంతంలో మొదలయ్యాయి. ఆలయ భూముల వైశాల్యంపై అవగాహన ఉండేందుకు భవిష్యత్తులో సీనియర్ (ప్రస్తుతం జూనియర్ సిబ్బంది) అధికారులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. ఆలయ సిబ్బందికి ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చేందుకు ఆలయ ఈవో ఎస్. వెంకట్రావు పైస్థాయి అధికారులను ఆదేశించారు. సిబ్బంది సర్వేలో పాల్గొనడం వల్ల ముందు ఆలయ భూములకు సంబంధించి పూర్తి అవగాహన ఉండి భూముల రక్షణ సులువు అవుతుందని ఈవో తెలిపారు.

8వ తేదీన సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

● ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తి

నల్లగొండ కల్చరల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): శ్రావణమాసంలోని పర్వదినాల్లో వరలక్ష్మి వ్రతానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. ఈ వ్రతాన్ని నోముకునేందుకు మహిళలు అంతా సిద్ధం చేసుకున్నారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారిని పూజిస్తే సిరిసంపదలు కలుగుతాయని భక్తుల నమ్మకం. శ్రావణ మాసం రెండో శుక్రవారం కావటంతో వరలక్ష్మి వ్రతాలను నోముకునేందుకు మహిళలు అన్నీ సిద్ధం చేసుకుంటున్నారు. పలు ఆలయాల్లో ప్రత్యేకమైన ఏర్పాట్లను చేశారు. పట్టణంలోని శేర్‌బంగ్లాలో సంతోషిమాత ఆలయంలో శుక్రవారం ఉదయం సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించనున్నారు. అర్చకులు కారంపూడి మోహనాచార్యులు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేకంగా అభిషేకం, కుంకుమార్చనలు, ఒడి బియ్యం, ఉద్యాపనలు వంటి పూజలు నిర్వహించనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి వ్రతాలను నోముకోవాలని కోరారు. అదే విధంగా తులసీనగర్‌లోని భక్తాంజనేయ స్వామి దేవాలయంలో ఉదయం 10.30 గంటలకు సామూహిక వ్రతాలు నిర్వహించనున్నారు. సరస్వతి అమ్మవారి జన్మ నక్షత్రం కావటంతో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు, అక్షర కంకణధారణ, సరస్వతి సూక్త హోమం, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించనున్నారు. వరలక్ష్మీ వ్రతాలు, అక్షరాభ్యాస కార్యక్రమాల్లో పాల్గొనే భక్తులు ముందుగానే తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆ ఆలయ మేనేజర్ తెలిపారు. పట్టణంలోని వీటీ కాలనీలో ఉన్న శ్రీదేవి, భూదేవి సహిత వెంకటేశ్వర స్వామి ఆలయం, బీట్ మార్కెట్‌లోని శ్రీ రామకోటి స్థూప దేవాలయం, పలు దేవాలయాల్లో వరలక్ష్మి వ్రత వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

9న శని త్రయోదశి పర్వదినం..

శ్రావణ మాసంలో వచ్చే పర్వదినాల్లో శని త్రయోదశి పండుగ ఒకటి.. ఈ పండుగ ఈ నెల 9వ తేదీన పట్టణంలోని పలు ఆలయాల్లో నిర్వహించనున్నారు. శనివారం రోజున నవగ్రహ ప్రత్యేక పూజలు, శని పూజలు నిర్వహించనున్నారు. తులసినగర్‌లోని భక్తాంజనేయస్వామి ఆలయంలో, వీటీ కాలనీలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో, పలు ఆలయాల్లో శని త్రయోదశి వేడుకలు జరగనున్నాయి. అందుకుఏర్పాట్లను కూడా నిర్వాహకులు సిద్ధం చేశారు.

దండు మైసమ్మ హుండీ ఆదాయం రూ.7.52లక్షలు

ఆత్మకూర్(ఎస్), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెమ్మికల్ దండు మైసమ్మ ఆలయంలో హుండీ లెక్కింపును మంగళవారం నిర్వహించారు. నాలుగు నెలల 10 రోజులకు హుండీలో రూ.7,52,460లను భక్తులు కానుకల రూపంలో లభించింది. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ సుమతి, ఈవో కుశలయ్య, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మూసీ పరవళ్లు..




యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలం సంగెం భీమ లింగం కత్వ వద్ద పరవళ్లు తొక్కుతున్న మూసీ

హైదరాబాద్ నగరం ఎగువ ప్రాంతంతో పాటు జిల్లాలో కురుస్తున్న వర్షానికి వలిగొండ మండలం సంగెం భీమలింగం కత్వ వద్ద మూసీ ప్రవహిస్తూ పరవళ్లు తొక్కుతోంది. చెరువులు కుంటలకు నీరు చెరుతోంది. మూసీ నుంచి నీరు ఉధృతంగా ప్రవహిస్తున్నందున మూసీ పరివాహక ప్రాంతాల్లో రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరుతున్నారు.

● స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి-యాదాద్రి

మూసీకి పెరిగిన ఇన్‌ఫ్లో: రెండు క్రస్టు గేట్ల ఎత్తివేత

● 4800 క్యూసెక్కుల వరద దిగువ మూసీకి విడుదల



మూసీ ప్రాజెక్టు రెండు గేట్లు ఎత్తడంతో దిగువకు వెళుతున్న నీరు

కేతేపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నాగార్జునసాగర్ తర్వాత రెండో పెద్దదైన మూసీ ప్రాజెక్టుకు మంగళవారం ఎగువ నుంచి వరద నీటి రాకడ పెరిగింది. ఎగువ పరివాహక ప్రాంతాల్లో వర్షాలు లేనందునవారం రోజులుగా మూసీ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో లేదు. ఇన్‌ఫ్లో పడిపోవడం, ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ఆయకట్టులో వానాకాలం పంటల సాగుకు నీటిని విడుదల చేస్తున్నందున ప్రాజెక్టు నీటిమట్టం వారం రోజుల నుంచి క్రమంగా తగ్గుతూ వస్తోంది. ఈ క్రమంలో ఆది, సోమవారాల్లో రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలోని వివిధ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షానికి వరద నీటితో మూసీ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. మూసీ నది పరివాహక ప్రాంతాల్లో వర్షాలు లేకున్నా హైదరాబాద్‌లో కురిసిన వర్షంతో వరద నీరు దిగువన ఉన్న మూసీ ప్రాజెక్టుకు చేరుతోంది. దీంతో సోమవారం సాయంత్రానికి 1248.48 క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో మంగళవారం ఉదయానికి 3900 క్యూసెక్కులుగా నమోదైంది. ఇది సాయంత్రానికి మరింత పెరిగి నాలుగు వేల క్యూసెక్కులకు చేరింది. రాత్రికి ఇన్‌ఫ్లో మరింత పెరిగే వీలుందని భావించిన డ్యాం అధికారులు మంగళవారం సాయంత్రం ఆరు గంటలకు ప్రాజెక్టు రెండు క్రస్టు గేట్లను ఎత్తి వరద నీటిని దిగువ మూసీకి విడుదల చేయాలని నిర్ణయించారు.

ఈ మేరకు మంగళవారం మధ్యాహ్నం నుంచి సోషల్ మీడియా ద్వారా సూర్యాపేట జిల్లా పరిధిలోని రత్నపురం, రామారం, టేకుమట్ల, కాసరబాద, పెన్‌పహాడ్ అనాజిపురం, అనంతారం, దోసపహాడ్, దాచారం, సజ్జపురం, ఎల్లారం, సోమారం, చింతకుంట్ల, మూసీఒడ్డు సింగారం, ఎల్లాపురం, శూన్యంపహాడ్, నల్లగొండ జిల్లా పరిధిలోని బొప్పారం, కాసనగోడు, చీకటిగూడెం, ఉప్పలపహాడ్, కొత్తపేట, కొప్పోలు, భీమారం, ఆమనగల్లు, లక్ష్మీదేవిగూడెం, రావులపెంట, నర్సింహులగూడెం, తక్కెళ్ళపహాడ్, తడకమళ్ళ, కాల్వపల్లి ఆలగడప, ముల్కలకాల్వ, రాయినిపాలెం, కేశవాపురం, తుంటకుంటవిల్లా, వాడపల్లి, వజీరాబాద్ తదితర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఆయా గ్రామాల రైతులు తమ పాడి పశువులు, మేకలు, గొర్రెలు, వ్యవసాయ పశువులను మేతకు, తాగునీటికి మూసీ నది పరిసరాల్లోకి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రైతులు కూడా నది పరిసర ప్రాంతాల్లోకి వెళ్లవద్దని అన్నారు. ఆ తర్వాత వరద ఉధృతి మరింత పెరిగితే గేట్ల నిర్వహణ ఇబ్బందిగా మారుతుందని భావించిన మూసీ ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు మంగళవారం సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో ప్రాజెక్టు 3, 8వ నెంబరు క్రస్టుగేట్లను రెండు అడుగుల మేర ఎత్తి 4800క్యూసెక్కుల వరద నీటిని దిగువ మూసీకి వదిలారు. ఎగువ నుంచి వచ్చే వరద ఉధృతి పెరిగితే మరిన్ని క్రస్టుగేట్లు ఎత్తి వరద నీటిని దిగువకు విడుదల చేస్తామని డ్యాం ఏఈఈ బాడిశ మధు తెలిపారు. 645అడుగుల(4.46టీఎంసీలు) పూర్తి స్థాయి నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం 64313అడుగులు(4.02టీఎంసీలు)గా ఉంది.

కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతాం



శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, వేముల వీరేశం

భువనగిరి రూరల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేవరకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతామని భువనగిరి, నకిరేకల్ ఎమ్మెల్యేలు కుంభం అనిల్ కుమార్‌రెడ్డి, వేముల వీరేశం అన్నారు. చలో ఢిల్లీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం హైదరాబాద్‌లోని శంషాబాద్ ఎయిర్‌పోర్టులో భువనగిరికి చెందిన కాంగ్రెస్ నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా చలో ఢిల్లీ కార్యక్రమంలో భాగంగా జంతర్‌మంతర్ వద్ద నిర్వహిస్తున్న మహాధర్నా కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వెళుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాశం శివానంద్, ఎలిమినేటి కృష్ణారెడ్డి, వెంకటేశ్, పద్మ కృష్ణగౌడ్, శ్రీనివాస్ ఉన్నారు.

ఉచిత విద్యను సద్వినియోగం చేసుకోవాలి

ఇంటర్ బోర్డు జాయింట్ సెక్రటరీ భీంసింగ్

నాగార్జునసాగర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలో నాణ్యమైన ఉచిత విద్యను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఇంటర్ బోర్డు జాయింట్ సెక్రటరీ ఎల్.భీంసింగ్ అన్నారు. మంగళవారం నాగార్జునసాగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన తనిఖీ చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రభుత్వం పలు సంస్కరణలను తీసుకువచ్చిందన్నారు. ఆన్‌లైన్ ద్వారా విద్యాబోధన చేస్తూ, విద్యార్థులను పోటీపరీక్షలకు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లతోపాటు ఉచితంగా నాణ్యమైన విద్య అందిస్తున్నామన్నారు. ఇంజనీరింగ్, మెడిసిన్ విద్యనభ్యసించే ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు సతీష్‌చంద్ర, గోపాలకృష్ణ, ఉపేంద్రాచారి, వినోద్, పాల్గొన్నారు.

కాల్వల్లో గుర్రపు డెక్కలు తొలగించరా..



గోకారం కాల్వలో అల్లుకున్న గుర్రపు డెక్కలు



వలిగొండ మండలం సంగెం మూసీ వంతెన వద్ద చెత్త చెదారం, గుర్రపు డెక్కలు



జిల్లాలో పంట పొలాలకు వెళ్లే కాల్వుల్లో గుర్రపు డెక్కలు నిండాయి. వలిగొండ మండలం పరిధిలోని రైతులు మూసీ ప్రధాన సాగునీటి వనరులు వరి, కూరగాయల సాగు చేస్తుంటారు. ప్రధాన కాల్వలైన సంగెం, గోకారం, నాగారంతో పాటు మూసీ కాల్వల్లో గుర్రపు డెక్కలు నీటి ప్రవాహంతో అడ్డుగా ఉన్నందున నీరు ముందుకు వెళ్లడం లేదు. ఫలితంగా పంట పొలాలు, చెరువులోకి నీళ్ల రాక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కాల్వుల మరమ్మతుల పేరిట అధికారులు ఏటా లక్షలాది రూపాయలు ఖర్చుచేస్తున్నారు. కొన్ని చోట్ల హడావిడిగా గుర్రపు డెక్కలను తొలగించి, మరి కొన్ని చోట్ల వదిలివేయడంతో సమస్య క్షేత్రస్థాయిలో పరిష్కారం కావడం లేదు. ప్రభుత్వం సాగు నీటికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నా, అధికారులు నిర్లక్ష్యం వీడి, కాల్వల్లోని గుర్రపు డెక్కలు, ముళ్ల కంచెలు తొలగించి నీటి ప్రవాహం సాఫీగా వెళ్లే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని మూసీ పరివాహక రైతులు కోరుతున్నారు.

● స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి-యాదాద్రి

ఇంకుడు గుంతలతో భూగర్భ జలాలు పెంపు

మద్దిరాల, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఇంకుడు గుంతలు నిర్మిస్తే భూగర్భ జలాలు పెంపొందుతాయని ఏపీవో గుండు వెంకన్న అన్నారు. మంగళవారం మండలంలోని రెడ్డిగూడెం గ్రామంలో నిర్మిస్తున్న ఇంకుడు గుంతలను పరిశీలించి మాట్లాడారు. గ్రామాల్లో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకుంటే ప్రభుత్వం ఆర్థికసాయం అందజేస్తోందని అన్నారు. కార్యక్రమంలో టీఏలు మురళి, చారి, పంచాయతీ కార్యదర్శి మమూనూరి ఉమ, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మపాలు అమృతం

తుంగతుర్తి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): అమ్మపాలు అమృతం వంటివని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఖైరున్నీషా అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కొత్తగూడెం అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొని మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని అన్నారు. పుట్టినబిడ్డకు వెంటనే ముర్రుపాలు అందించాలని అన్నారు. ఆరు నెలల వరకు తల్లిపాలే సంపూర్ణ ఆహారమని అన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు లక్ష్మీబాయి, శారద, ఆయాలు, పుష్ప పాల్గొన్నారు.

ప్రారంభం కోసం ఎదురుచూపులు

● పూర్తయిన ఉపకోశాధికారి కార్యాలయం ● ప్రారంభం కానందున ఇబ్బందులు

తుంగతుర్తి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): తుంగతుర్తి నియోజకవర్గం కేంద్రంలోని ఉపకోశాధికారి కార్యాలయం పనులు ఎట్టకేలకు పూర్తయి ప్రారంభం కోసం ఎదురుచూస్తోంది. తుంగతుర్తిలో ఉపకోశాధికారి కార్యాలయం ప్రస్తుతం స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలోని చిన్న గదిలో నడుస్తోంది. సిబ్బందికి సరిపడా గదులు లేవు. మహిళా ఉద్యోగులకు మరుగుదొడ్లు లేవు. కార్యాలయం పైకపు పెచ్చులు ఊడిపడుతున్నందున 2020లో అప్పటి ప్రభుత్వ హయాంలో మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నూతన ఉప కోశాధికారి కార్యాలయ నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్ రూ.15లక్షలు నిధులు మంజూరు చేసి శంకుస్థాపన చేశారు. ఈ భవనానికి పూర్తిగా నిధులు సరిపోకపోనందున పనులు ఆగాయి. 2022 సంవత్సరంలో అదనంగా రూ. 3లక్షలు మంజూరయ్యాయి. ఇటీవల పత్రికల్లో వచ్చిన కథనాలకు కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ స్పందించి కొన్ని అదనపు నిధులు మంజూరు చేశారు. పనులు నెల రోజుల క్రితం పూర్తయినా భవనాన్ని ప్రారంభించనందున కార్యాలయానికి వచ్చే పింఛనర్లు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు వెంటనే స్పందించి నూతన భవనాన్ని ప్రారంభించే విధంగా కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు. .



తుంగతుర్తిలో పూర్తయిన ఉపకోశాధికారి కార్యాలయం

కార్యాలయాన్ని వెంటనే ప్రారంభించాలి



పూర్తయిన భవనాన్ని వెంటనే ప్రారంభించి కార్యాలయానికి వచ్చే ఉద్యోగులకు, పెన్షనర్‌లకు ఇబ్బందులు పాలవుతున్నారని కార్యాలయం ప్రారంభమైతే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అధికారులు వెంటనే కార్యాలయాన్ని ప్రారంభించే విధంగా కృషి చేయాలని కోరారు.

● మల్లెపాక సాయిబాబా, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి

ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు

సూర్యాపేట క్రైం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట పట్టణంలో ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తూ వ్యాపారాలు చేసేవారిపై చర్యలు తీసుకుంటామని పట్టణ ఇన్‌స్పెక్టర్ ఎ. వెంకటయ్య అన్నారు. మంగళవారం పట్టణంలోని కుడకుడ రోడ్డులో ఆక్రమణలను తొలగించి ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టారు. రోడ్లపై బోర్డులు, ఇతర వస్తువులు ఏర్పాటు చేయరాదన్నారు. సూర్యాపేటలో రోజు రోజుకు ట్రాఫిక్ పెరిగిపోతుందన్నారు. రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు చేయడం వలన సాధారణ ప్రజలతో పాటు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని స్పష్టం చేశారు. తోపుడు బండ్లపై వ్యాపారాలు చేసే వారు రోడ్లకు దూరంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ట్రాఫిక్ ఎస్‌ఐ ఆర్.సాయిరాం సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బయ్యన్న దేవుడికి బోనాలు



తిరుమలగిరి మునిసిపల్ కేంద్రంలో బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

తిరుమలగిరి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): తిరుమలగిరి మునిసిపల్ కేంద్రంలో యాదవులు తమ కులదైవం బయ్యన్న దేవునిడికి బోనాలు సమర్పించారు. మంగళవారం మునిసిపల్ కేంద్రంలోని యాదవులు భక్తిశ్రద్ధలతో బోనాలు వండి, ఆచారాల ప్రకారం డప్పుచప్పుళ్లతో గుడివద్దకు వెళ్లి బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో పయ్యావుల వెంకన్న, ఎనుగుల నాగన్న, వెంకన్న, లింగయ్య, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

10న కోదాడలో జరిగే రాష్ట్ర స్థాయి పాటల పోటీలు



రాష్ట్ర స్థాయి పాట పోటీలకు ఎమ్మెల్యే పద్మావతిని ఆహ్వానిస్తున్న చిరంజీవి యూత్ కమిటీ సభ్యులు

కోదాడ టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి పాటల పోటీలను కోదాడలో బాయ్స్ హైస్కూల్‌లో ఈ నెల 10వ తేదీన నిర్వహిస్తామని చిరంజీవి యువజన సంఘం అధ్యక్షుడు గుండెపంగు రమేష్ అన్నారు. మెగా స్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకుని మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్శిటీ జూబ్లీ ఆడిటోరియంలో కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డిని కలిసి ఆహ్వానపత్రికను అందజేసి మాట్లాడారు. ఈ అవకాశాన్ని గాయనీగాయకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో గాలి శ్రీనివాస్‌నాయుడు, గంధం పాండు, సీతారాంసింగ్‌నాయక్, రాజేష్ పాల్గొన్నారు.

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

చిలుకూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల కోసం ఉపాధ్యాయుడు కందిబండ రామారావు రచించిన మెంటల్‌ఎబిలిటీ పుస్తకాన్ని సద్వినియోగం చేసుకోవాలని హెచ్‌ఎం కరుణాకర్‌రెడ్డి సూచించారు. మంగళవారం చిలుకూరు లోని జడ్పీహెచ్‌ఎస్‌లో పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. నేషనల్ మీమ్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పొందడానికి పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు ఈ పుస్తకం ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ పుస్తకాన్ని రచించిన ఉపాధ్యాయుడు రామారావును ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ బిల్లులు సక్రమంగా అందించాలి

చిలుకూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో ఆరోగ్యశ్రీ బిల్లులు సక్రమంగా విడుదల కానందున ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలతరెడ్డి అన్నారు. మండలంలోని బేతవోలులో గ్రామంలో అనారోగ్యానికి గురైన బీజేపీ నాయకుడు బత్తిని పుల్లయ్యను మంగళవారం పరామర్శించి మాట్లాడారు. ఆరోగ్యశ్రీ బిల్లులు రానందున వైద్యశాలల్లో రోగులకు సరైన వైద్యం అందడంలేదన్నారు. ఆమె వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేష్, ప్రధాన కార్యదర్శి కొండ శ్రీను, ఉపాధ్యక్షుడు సతీష్, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణారెడ్డి, బసవయ్య, లింగారెడ్డి, నాగాచారి, బత్తిన శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

జీవో నెం.924రద్దు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలి

గరిడేపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): జీవో నెం.924ను ప్రభుత్వం రద్దు చేసి ఆశా కార్యకర్తలకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీపీఎం మండల కార్యదర్శి షేక్ యాకుబ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఆశా కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారుప కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఆశా కార్యకర్తలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ అధికారంలోకి వచ్చి 17 నెలలు దాటినా కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందని అన్నారు. కార్యక్రమంలో మండాది ఉమా, అరుణ, భవాని, నాగమణి, నిర్మల, సుహాసిని, సైదమ్మ, వీరమ్మ, జానమ్మ, హేమలత, సుదా, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

ఎస్సారెస్పీకి నీటిని విడుదల చేయాలి

నూతనకల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఎస్సారెస్పీ కాలువలకు నీటిని విడుదల చేసి చెరువులు నింపాలని సీపీఐ మండల కార్యదర్శి తొట్ల ప్రభాకర్‌గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.భూగర్భ జలాలు అడుగంటడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎమ్మెల్యే సామేలు స్పందించి నీటిని విడుదల చేయించాలని కోరారు. ఈ సమావేశంలో రైతులు లింగయ్య, వీరన్న, రాములు, వెంకన్న, శ్రీరాములు, మల్లయ్య, సురేష్ ఉన్నారు.

క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో పోరాడాలి



మాట్లాడుతున్న ఏఐకేఎంఎస్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కోటేశ్వరావు

సూర్యాపేట టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): క్విట్ ఇండియా స్ఫూర్తితో బహుళజాతి కంపెనీలను దేశం నుంచి తరిమికొట్టాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వి.కోటేశ్వరరావు అన్నారు. బొంబాయిలో డూఆర్‌డై నినాదంతో 1942 ఆగస్టు 9వ తేదీన చేపట్టిన క్విట్ ఇండియా ఉద్యమాన్ని గుర్తుచేసుకుంటూ మంగళవారం జిల్లా కేంద్రంలోని చంద్రపుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో విదేశీ బహుళ జాతి కంపెనీలు అమెజాన్, వాల్‌మార్ట్, ఓలా, ఉబర్, సిగ్గీ, మోనో వంటి సంస్థలు ఆహారం నుంచి అన్నిరకాల వస్తువులను విక్రయిస్తూ దోపిడీకి పాల్పడుతున్నాయని ఆరోపించారు. వ్యవసాయ రంగంపై పట్టు సాధించేలా కార్పొరేట్ సంస్థలు యత్నిస్తుండగా ప్రధాని మోదీ వారికి సహకరిస్తూ పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. భారతదేశంపై 25శాతం సుంకం విధిస్తున్న అమెరికా తీరుపై ప్రధాని మోదీ ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. బహుళ జాతి కంపెనీలు భారతదేశం నుంచి వదిలివెళ్లాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 13వ తేదీన గ్రామగ్రామాన నిరసన కార్యక్రమాలు, సభలు, సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మండారి డేవిడ్‌కుమార్, ఇఫ్టూ జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు, ఉదయగిరి, నాగయ్య, రవి, పుల్లూరి సింహాద్రి, కంచర్ల నర్సమ్మ, బొల్లి వెంకన్న, ఎర్ర ఉమేష్ పాల్గొన్నారు.

నీరొస్తుంది.. దారేదీ?

(5వ పేజీ తరువాయి)

14 భారీ నీటికుంటలు నింపేందుకు నీటిని కాల్వల ద్వారా అందించాల్సి ఉంది. ఇప్పటికే రైతులు ఆరుతడులకు సిద్ధమై నెల రోజులు గడిచినా నీరు అందని దుస్థితి నెలకొంది. వారం రోజులుగా వర్షాలు కురవడంతో పంటకు ప్రాణం పోసినట్లయ్యింది. వర్షాలు పడకుంటే పంటలు ఎండిపోయి ఆర్థికంగా నష్టం చేకూరేదని రైతులు వాపోతున్నారు.

తెగిన కాల్వ

నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిండి కాల్వకు నీటిని విడదుదల చేయడంతో కిష్టాపురం దగ్గర కాల్వ తెగి దాదాపుగా 5 ఎకరాల నుంచి 10 ఎకరాల వరకు పత్తి పంట నీట మునిగింది. గమనించిన రైతులు అధికారులకు విషయాన్ని చేరవేయడంతో కాల్వకు నీటిని నిలిపివేయడంతో భారీ పంట నష్టం ఆగింది. పూడిక తీయకుండానే నీటిని విడుదల చేయడాన్ని రైతులు తప్పుపడుతున్నారు. ఒక వేళ మరోసారి నీటిని విడుదల చేసినా ఇదే పరిస్థితి ఉంటుందని రైతులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. నీటి పారుదల శాఖ అధికారులు పర్యవేక్షణ పూర్తిగా లోపించిందని, కాగితాల వరకు రిపోర్టులు ఉంటున్నాయన్నారు. క్షేత్రస్థాయిలో మరోలా ఉంటుందని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా నీటిపారుదల శాఖ అధికారులు కాల్వలో పేరుకుపోయిన చెత్తతో పాటు కాల్వల నీరు సజావుగా పారేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రెండు రోజుల్లో పూడిక, పిచ్చిమొక్కలు తొలగిస్తాం

కాల్వల్లో పూడిక తీయడంతో పాటు పిచ్చిమొక్కలను రెండు రోజుల్లో తొలగిస్తాం. కాల్వ తెగిన ప్రాంతంలో ఎక్స్‌కవేటర్‌తో మట్టిపోయిస్తున్నాం. కాల్వను పటిష్ఠం చేసి నీటిని విడుదల చేస్తాం.

●శ్రీనివాస్, ఏఈ

భూభారతి అర్జీలను పరిష్కరించాలి

సూర్యాపేట రూరల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి)ః భూభారతి అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి భూసమస్యలను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. మంగళవారం సూర్యాపేటలోని తహసీల్దార్ కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భూ అర్జీలపై అధికారుల బృందాలు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి భూ సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. అర్హులకు నూతన రేషన్ కార్డులను త్వరగా పంపిణీ చేయాలన్నారు. భూభారతి రెవెన్యూ సదస్సుల్లో 1758 అర్జీలు వచ్చాయని 369 అర్జీలను పరిశీలించి, వాటిలో 34 అర్జీలను పరిష్కరించామని. మిగిలిన అర్జీలు వివిధ దశల్లో ఉన్నాయని తహసీల్దార్ కృష్ణయ్య అదనపు కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో డీటీ లావణ్య, సీనియర్ అసిస్టెంట్ కపిల్ పాల్గొన్నారు.

కాళేశ్వరం పేరుతో తప్పుడు ప్రకటనలు సరికాదు

తుంగతుర్తి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం పేరుతో అధికారులు తప్పుడు ప్రకటనలు చేయడం సరికాదని బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. పీసీ ఘోష్ కమిషన్ పూర్తి నివేదికను ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. పీసీ ఘోష్ కమిషన్ నివేదిక పూర్తి సారాంశాన్ని ప్రజలు తెలియపర్చకుండా ప్రభుత్వం చెప్పదల్చుకున్న విషయాన్నే నివేదిక పేరుతో క్యాబినెట్ ప్రెస్‌మీట్‌లో ముఖ్యమంత్రి ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వాస్తవాలను నీటిపారుదల మాజీ మంత్రి ప్రజలకు వివరించారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు నిజా నిజాలను ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షులు గోపగాని శ్రీనివాస్, మండల నాయకులు గోపగాని రమేష్, తడకమళ్ల రవికుమార్, గోపగాని వెంకన్న, నల్లబెల్లి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య నివారణకు మొక్కలు పెంచాలి



ప్రధాన రహదారుల వద్ద నిర్మిస్తున్న కూడలి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మునిసిపల్ కమిషనర్ సీహెచ్ హన్మంతరెడ్డి

సూర్యాపేట టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి):కాలుష్య నివారణకు మొక్కలు పెంచాలని మునిసిపల్ కమిషనర్ సీహెచ్ హన్మంతరెడ్డి అన్నారు. మునిసిపల్ 100రోజుల ప్రణాళికలో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలో అమృత మిత్ర ఉమెన్ ఫర్ ట్రీస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వన మహోత్సవంలో మొక్కలు నాటి మాట్లాడారు. మొక్కలు భవిష్యత్ ఆస్తి అని, మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించడం అందరి బాధ్యత అని అన్నారు. ముందుగా జిల్లా కేంద్రంలోని పెద్ద మసీద్ వద్ద ఏర్పాటు చేస్తున్న కూడలి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, టీఎంసీ శ్వేత, శివప్రసాద్, వసుంధర, వసీం, గోనె విజయ, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

తుంగతుర్తి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన తడకమళ్ల రాములమ్మ క్యాన్సర్‌తో మూడేళ్ల క్రితం మృతిచెందింది. ఆమె భర్త తడకమళ్ళ వెంకన్న అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందాడు. వారి ఇద్దరు ఆడపిల్లలు ఒంటరిగా మిగలడంతో వారికి బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తాడికొండ సీతయ్య, గోపగాని రమేష్, గోపగాని శ్రీనివాస్, రవికుమార్, శ్యాంసుందర్, భిక్షం పాల్గొన్నారు.

అంజయ్యయాదవ్ ఆశయాలను సాధిస్తాం



సూర్యాపేటలోని మాట్లాడుతున్న మట్టపల్లి గంగయ్యయాదవ్

భానుపురి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఇమాంపేట మాజీ సర్పంచ్ బోయిన అంజయ్యయాదవ్ ఆశయాలను సాధిస్తామని సూర్యాపేట లియాఫీ డివిజన్ అధ్యక్షుడు మట్టపల్లి గంగయ్యయాదవ్ అన్నారు. బోయిన అంజయ్యయాదవ్ 18వ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం సూర్యాపేట లియాఫీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుడకుడలోని అనాథాశ్రమంలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఎల్‌ఐసీ ఏజెంటుగా ఎదిగిన గంగయ్య యాదవ్ చేపట్టిన సామాజిక సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శమని అన్నారు. అనంతరం ఇమాంపేటలోని ఆయన విగ్రహానికి లియాఫీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో లియాఫీ డివిజన్ నాయకుడు బైరి రాంమూర్తి, గుమ్మడవెల్లి శ్యాంసుందర్, ఎస్‌కే ఖాదర్‌బాబు, మట్టపల్లి శ్రీనివాస్, బిక్కుసింగ్, నిర్మల, పోరెండ్ల సత్తయ్య, పుట్టా వెంకన్న, మల్లికార్జున్, సురేందర్‌నాయక్, వాంకుడోతు పద్మవెంకన్న, వెంకటేశ్వర్లు గడ్డం వెంకన్న, లక్ష్మీనారాయణ, బాలమల్లు, బోయిన రూప్సీ పృథ్వీ, కుంచం అంజయ్య, బాణాల వెంకన్న, యాదగిరి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడాలి



సిగ్నేచర్ డే వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

కోదాడ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఫార్మసీ విద్యార్థులు ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడాలని సనా ఫార్మసీ కళాశాల డైరెక్టర్ నవమాన్ అన్నారు. ఫార్మసీ పూర్తి చేసిన విద్యార్థులకు మంగళవారం సిగ్నేచర్‌డే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మసీ రంగం వేగంగా వృద్ధి చెందు తోందని, ఈ అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ఉల్లాసంగా, ఉత్సాహంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గోపిరెడ్డి, హెచ్‌వోడీ నరేంద్రనాయుడు, అత్తర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

'ఎస్సారెస్పీ నీటిని వెంటనే వదలాలి'

తిరుమలగిరి రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఎస్సారెస్పీ కాలువ ద్వారా నీటిని ప్రభుత్వం వెంటనే వదిలి రైతులను ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి జి.ఉప్పలయ్య అన్నారు.మంగళవారం మండలంలోని వెలిశాల గ్రామంలో ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా నీటిని వదలకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. వెంటనే నీటిని వదిలి రైతులను ఆదుకోవాలని, లేనట్లయితే ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు కడారి లింగయ్య, సీహెచ్ సోమయ్య, కృష్ణయ్య, వెంకటయ్య, నాగార్జున్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లపై చిత్తశుద్ధి ఉండాలి

గరిడేపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల అమలుపై కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉండాలని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ్ల ధనుంజయ నాయుడు అన్నారు. మంగళవారం మండలంలోని గానుగుబండ గ్రామంలో బీసీ నాయకులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర వ్యాప్తంగా బీసీలు ఉద్యమిస్తుంటే, ఉద్యమాన్ని తప్పుదోవ పట్టించేవిధంగా వ్యవహరించడం సరికాదన్నారు. బీసీలు తమ న్యాయమైన హక్కులకై ఉద్యమించాలని, దేశ వ్యాప్తంగా కులగణన చేపట్టి చట్ట సభల్లో బీసీలకు 50 శాతం సీట్లు కెటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పోకల వెంకటేశ్వర్లు, ముళ్ల జానయ్య, యల్లావుల రమేష్, మెండె లింగరాజు, జక్కుల రమణ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో పచ్చదనం.. పరిశుభ్రత

పెన్‌పహాడ్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది మంగళవారం పరిశుభ్రత, పచ్చదనం కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి రాజేష్ ఆధ్వర్యంలో పిచ్చి మొక్కలు, కంపచెట్లను ఆశాకార్యకర్తలు తొలగించారు. రాజేష్‌ను స్థానికులు అభినందించారు.

కూరగాయల పెంపకంపై విద్యార్థులకు అవగాహన

పెన్‌పహాడ్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): కూరగాయల పెంపకంపై మండలంలోని అనాజిపురం మోడల్ స్కూల్ విద్యార్థులకు గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్తలు డి.ఆదర్శ్, ఎం.సుగంధిలు అవగాహన కల్పించారు. మంగళవారం మోడల్ స్కూల్‌ను సందర్శించి విద్యార్థులకు పౌష్టికాహారం ఇంటితోట పెంపకం, వాటి ప్రాముఖ్యంపై అవగాహన కల్పించారు. పాలకూర, తోటకూర, గోంగూర, టమాట, సొరకాయ విత్తనాలతో పాటు మిరప, వంకాయ, టమోటా మొక్కలను పాఠశాల విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కోడి లింగయ్య, పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి దేవాలయంలో పూజలు

అర్వపల్లి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): కోమటిపల్లి గ్రామంలో ఆంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్-మాలిని దంపతులు సందర్శించి పూజలు నిర్వహించారు. అనంతరం ఆంజనేయస్వామి దేవాలయంతో పాటు బొడ్రాయిని సందర్శించి పూజలు చేశారు. కార్యక్రమంలో యాదయ్య, సుదర్శన్, జాల నర్సింహ్మా, జాల మల్లయ్య, మాంద్ర లింగయ్య, యాదగిరి, అవిలయ్య, బాషాని రామశంకర్, గోపి పాల్గొన్నారు.

లచ్చయ్య మృతి ఉద్యమానికి తీరని లోటు

చివ్వెంల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కమ్యూనిస్టు ఉద్యమ కీలక నేత లచ్చయ్య (85)మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు అన్నారు. మండలంలోని చందుపట్ల గ్రామానికి చెందిన లచ్చయ్య అనారోగ్యంతో సోమవారం రాత్రి మృతి చెందారు. చందుపట్లలో ఆయన మృతదేహానికి సీపీఎం, కమ్యూనిస్టు పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మట్టిపెల్లి సైదులు, వేల్పుల వెంకన్న, స్టాలిన్, పారేపల్లి వెంకట్రావు పాల్గొన్నారు.

ముగిసిన పవిత్రోత్సవాలు

సూర్యాపేట టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయంలో మూడు రోజులుగా జరుగుతున్న పవిత్రోత్సవాలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి 108 కలశాలతో పాలు, పెరుగు, తేనె, నెయ్యి, పండ్ల రసాలు, ఇతర సుగంధ ద్రవ్యాలతో తిరుమంజన స్నపనం, అభిషేకం నిర్వహించారు.

ప్రతిఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలి

తుంగతుర్తి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతిఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని తుంగతుర్తి లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు తల్లాడ కేదారి అన్నారు. లయన్స్ క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ కోనేరు నాగేశ్వరరావు వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం మండల కేంద్రంలోని సంతోష్ ప్రైవేట్ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో లైన్స్‌స్ క్లబ్ కోశాధికారి గుండగాని రాము, కోఆర్డినేటర్లు ఓరుగంటి శ్రీనివాస్, ఎనగందుల సంజీవ, గిరి డాక్టర్ చారి, పులుసు వెంకటనారాయణ, ఓరుగంటి సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

సర్వాయిపాపన్నగౌడ్ జయంత్యుత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

హుజూర్‌నగర్ ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): సర్వాయి పాపన్నగౌడ్ జయంత్యుత్సవాల విజయవంతం చేయాలని జైగౌడ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు నారగోని శంకర్‌గౌడ్, తండు రమేష్ కోరారు. జైగౌడ సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఈ నెల 10న నిర్వహించిన జయంత్యుత్సవాల పోస్టర్ మంగళవారం పట్టణంలోని ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో బెల్లంకొండ చిరంజీవి, రామకృష్ణ, నర్సింహారావు, పండ్ల హుస్సేన్, నాగరాజు, బాబు, రాంబాబుపాల్గొన్నారు.

రోగాలను ప్రాథమిక స్థాయిలోనే గుర్తించాలి

ఆత్మకూర్(ఎస్), ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్, పక్షవాతం రోగాలను ప్రాథమిక స్థాయిలోనే గుర్తించి వైద్యాధికారులను సంప్రదించాలని పాలియేటివ్ కేర్ డాక్టర్ సతీష్, మండల వైద్యాధికారి మౌనిక సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో చెరుకు యాదగిరి, శ్వేత, చంద్ర, సైదులు, మాణిక్యం, కొండ్ల శ్రీనివాస్, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.